# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం-30- మే - 2025 | సంపుటి : 3 | సంచిక : 4 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఉమ్మడి పాలమూరు జిల్లాకు ట్రిపుల్ ఐటీ మంజూరు

- దివిటిపల్లిలో ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ అనుమతి
- జీవో ఎంఎస్ నంబర్ 24తో అధికారిక ప్రకటన
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సీఎం రేవంత్ స్పందన
- పాలమూరు జిల్లాలోనే ఉన్నత విద్యకు అవకాశం
- ముఖ్యమంత్రి కి ఎమ్మెల్యేల కృతజ్ఞతలు
- మంజూరులో సహకరించిన మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు
- నిరుపేద విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ వల్ల లాభాలు

3లో..



## ఎంపీగా ఓడించడం కుట్రే!

- లీకులపై ఆగ్రహం – "ఎండగట్టమంటే నాపై ప్రతాపమా?"
- పెయిడ్ సోషల్ మీడియాలో విమర్శలపై గుసగుస
- లిక్కర్ కేసు సమయంలో రాజీనామా ప్రస్తావన – కేసీఆర్ ఆపారు
- పార్టీ విలీనానికి వ్యతిరేకత – "భాజపాలో కాదు, స్వతంత్రంగా కొనసాగాలి"
- పార్టీ స్పందించకపోవడంపై అసంతృప్తి
- కేసీఆర్ మాత్రమే నాయకుడు – "వెన్నుపోటు కాదు, నేరుగా పోరాటం"
- లేఖలపై వివరణ – "ఒక్క సూచనలోనైనా తప్పుందా?"
- కుటుంబానికి దూరం చేసే కుట్ర?
- జాగృతి కార్యక్రమాల గొప్పతనాన్ని గుర్తు చేసిన కవిత

2లో..






## ఇందిరా గాంధీని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలి

### నిజాంపేటలో జైహింద్ ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి
### కేంద్ర నిర్ణయంపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేతలు

- యుద్ధ నిర్ణయంపై అఖిలపక్ష సంప్రదనలు, విరమణపై ఏకపక్ష ధోరణి
- సైనికుల ఆత్మస్థైర్యంపై ప్రభావం చూపిన కేంద్ర నిర్ణయం
- ఇందిరా గాంధీ ధైర్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్న రేవంత్
- బలూచిస్తాన్ విషయంలో కేంద్రానికి తగిన ధైర్యం లేదన్న విమర్శ
- రాహుల్ గాంధీ మద్దతు.. కానీ ప్రధాని రాజకీయ లబ్ధి ప్రయత్నమన్న ఆరోపణ

**నిజాంపేట,తెలంగాణ ముచ్చట్లు:**

భారత సైనికులకు మద్దతుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు నిర్వహించిన "జైహింద్" ర్యాలీలో నిజాంపేటలో పీసీసీ నాయకులతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారంతా కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ప్రధాన మంత్రి యుద్ధ నిర్ణయానికి సంబంధించి అఖిలపక్షాల

మిగతా 2




## తెలంగాణ కాంగ్రెస్ కమిటీలకు ఏఐసీసీ ఆమోదం

**హైదరాబాద్,,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలకు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. పొలిటికల్ అఫైర్స్ కమిటీ, అడ్వైజరీ కమిటీలకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డీలిమిటేషన్, పీసీసీ క్రమశిఓణ కమిటీలకు సైతం ఏఐసీసీ ఆమోదం తెలిపింది.

22 మందితో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇంఛార్జ్ ,సీఎం, పీసీసీ అధ్యక్షుడితో కలుపుకొని మొత్తం 22 మందితో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ ఏర్పాటు కానుంది. అడ్వైజరి కమిటీలో ఇంఛార్జీ ,సీఎం, పీసీసీ చీఫ్ తో కలుపుకుని 15 మందికి

మిగతా 2లో..



## ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి..

- ప్రజా సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వ చొరవలు
- ఖమ్మం జిల్లా సమీక్షా సమావేశంలో కీలక నిర్ణయాలు
- నకిలీ విత్తనాలపై కఠిన చర్యల ఆదేశం
- ధాన్యం కొనుగోలులో రికార్డు స్థాయి చెల్లింపులు
- ఇందిరమ్మ ఇండ్లకు పారదర్శక లబ్దిదారుల ఎంపిక
- భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు
- వానాకాలం పంటలకు ముందస్తు ఏర్పాట్లు
- ఆరోగ్య శాఖపై సమీక్ష, మందుల స్టాక్, ఆసుపత్రుల నిర్వహణ
- చేనేత, సహకార శాఖలపై తుమ్మల సూచనలు
- సాదా బైనామాల పరిష్కారానికి చర్యలు
- ఇసుక సరఫరా, గృహ నిర్మాణ సామాగ్రిపై ఆంక్షలు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వర్షాకాల ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక, వ్యవసాయ శాఖ ముందస్తు సాగు వంటి పలు అంశాలపై ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లతో కలిసి సమీక్షించారు.

మిగతా 4




## తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్లోకి ఎంట్రీ




- పంజాబ్ పతనం – 101 పరుగులకు కుప్పకూలిన ఇన్నింగ్స్
- హాజిల్‌వుడ్, సుయాశ్ శర్మ మూడేసి వికెట్లు
- సాల్ట్ మెరుపు – ఆర్సీబీ 10 ఓవర్లలోనే లక్ష్యం చేధన
- ప్లే ఆఫ్స్ చరిత్రలో ఆర్సీబీకి అతి పెద్ద విజయ రికార్డు
- పంజాబ్‌కు రెండో అవకాశంగా క్వాలిఫయర్-2

8లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఇందిరా గాంధీని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయం తీసుకున్నప్పటికీ, యుద్ధ విరమణ నిర్ణయాన్ని మాత్రం ఏకపక్షంగా తీసుకున్నారని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నిర్ణయం భారత సైనికుల ఆత్మస్థైర్యంపై ప్రభావం చూపిందని పలువురు నాయకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ..భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నాయకత్వంలో పాకిస్తాన్ విభజన జరిగి బంగ్లాదేశ్ ఏర్పడిన సంఘటనను గుర్తు చేస్తూ, అదే ధైర్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ప్రధానికి ఉందని వ్యాఖ్యానించారు. బలూచిస్తాన్ విషయంలో అదే తీరు చూపలేదని అభిప్రాయపడ్డారు.

యుద్ధంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇచ్చినప్పటికీ, ప్రధాని మాత్రం 'తిరంగా' వంటి కార్యక్రమాల ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. చైనా, పాకిస్తాన్ లాంటి దేశాలకు గట్టి సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయాలే ప్రధానికి ఆదర్శంగా నిలవాలన్నారు.



# జై హింద్ యాత్రలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

పాకిస్థాన్‌పై సైనికులు వీరోచితంగా పోరాడి సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ, సైనికుల కు అభినందనలు తెలిపే ఉద్దేశంతో ఎఐసిసి పిలుపు మేరకు పిసిసి ఆధ్వర్యంలో 'జై హింద్' కార్యక్రమం నిర్వహించారు.

హైదరాబాద్ మియాపూర్ బాచుపల్లి వద్ద ఉన్న కెజీఆర్ కన్వెన్షన్‌లో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, శాసన సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా పాల్గొన్నారు.



# కౌండిన్య సంఘం సహకారంతో నిరుపేద మహిళకు కుట్టుమిషన్ అందజేత

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:

హనుమకొండ జిల్లా హాసనపర్తి మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కూనూరు స్వప్నకు కౌండిన్య ఉత్తర అమెరికా గౌడుల సంఘం తరపున ఇరవై వేల రూపాయల విలువైన కుట్టుమిషన్‌ను అందజేశారు. కుటుంబాన్ని పోషించడంలో నిమగ్నమైన ఆమెకు ఈ సహాయం జీవనాధారంగా నిలవనుంది. స్వప్న భర్త శ్రీధర్ వయస్సు ముప్పై ఐదు సంవత్సరాలు కాగా, ప్రమాదవశాత్తు మరణించారు. చిన్న వయసులో భర్తను కోల్పోయిన స్వప్న, ఇద్దరు చిన్నపిల్లలతో కలిసి ఆర్థికంగా అత్యంత క్లేశంలో జీవనం సాగిస్తున్నారు. ఈ విషయం జనగామ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు గద్దం రాజు గౌడ్, రాష్ట్ర నాయకుడు జనగాం వెంకన్న గౌడ్ వారి ద్వారా ఉత్తర అమెరికా గౌడుల సంఘం సభ్యుల దృష్టికి వెళ్లింది. దీనిపై స్పందించిన వారు, స్వప్న కుటుంబానికి కుట్టుమిషన్‌తో పాటు, దుస్తుల తయారీకి అవసరమైన వస్తువులను అందజేశారు.

ఈ సహాయాన్ని గ్రామానికి చేర్చడంలో నాతి గణేష్ ప్రముఖంగా సేవలందించారు. ముందుకొచ్చి మానవతా దృక్పథంతో సహకరించిన కౌండిన్య ఉత్తర అమెరికా గౌడుల సంఘానికి తెలంగాణ గౌడ సంఘం ప్రతినిధులు మరియు సిద్ధాపూర్ గ్రామ గౌడ సంఘం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం కార్యక్రమంలో హనుమకొండ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీపతి గోపి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తిని వెంకన్న గౌడ్, నాయకులు పులిరాజు గౌడ్, సిద్ధాపూర్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు తాబేటి మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ జనగాం కిరణ్ గౌడ్, మెరుగు రాజశేఖర్ గౌడ్, కూనూరు రాజేంద్ర గౌడ్, చిర్రా రమేష్ గౌడ్, బుక్క చిరంజీవి, భక్త సురేష్, బొక్క బాబు, బొక్క రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం మహిళా మార్ట్ ను లాభాల బాటలో నడిపేలా నిరంతరం కృషి చేయాలి....

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

ఖమ్మం మహిళా మార్ట్ ప్రత్యేకత చాటే విధంగా మార్ట్ నిర్వహణకు మహిళా సంఘాలు బాధ్యత వహించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు.

గురువారం ఖమ్మం, వైరా రోడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్. వి. పాటిల్, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, ఖమ్మం జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌లతో కలిసి ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సందర్శించారు. మహిళామార్ట్ ఏర్పాటుకు దోహదపడిన పలు అంశాలు, మార్ట్ యొక్క ఉద్దేశ్యం, విక్రయించే ఉత్పత్తులు, ఖమ్మం బ్రాండింగ్ విలువ పెంచేందుకు తీసుకున్న చర్యలు వంటి పలు అంశాలను వారికి జిల్లా కలెక్టర్ వివరించారు. మార్ట్‌లో ఏర్పాటు చేసిన వస్తువులు, ఉత్పత్తులను పరిశీలించి తృణ ధాన్యాలు, పప్పులను మహిళలు ప్యాకింగ్ చేసే విధానాన్ని ఆసక్తిగా వారు తిలకించారు. ధూప్‌స్టిక్, అగర్ బత్తులు వేటితో తయారు చేశారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సీపీ, ఎస్పీ, డీఎఫ్‌ఓలు పలు ఉత్పత్తులను మార్ట్‌లో కొనుగోలు చేశారు. ఖమ్మం మహిళా మార్ట్ బాగుందని కితాబు ఇస్తూ, వ్యాపారం అనుకూలతకు మహిళా నిర్వాకురాలకు పలు సూచనలు ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు అనేక రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించే వేదికగా మహిళామార్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమీకృత మార్కెట్‌లో కూడా ఓ స్టాల్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. వీటితోపాటు ఆన్‌లైన్‌లో కూడా మహిళా ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్. వి. పాటిల్ మాట్లాడుతూ మహిళా ఉత్పత్తుల విక్రయానికి మంచి కేంద్రాన్ని మార్ట్ రూపంలో ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ మార్ట్‌లో మహిళల ఉత్పత్తులను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. అటవీ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మార్ట్‌లో అవకాశం కల్పించాలని, వాటి ద్వారా మహిళలకు మరింత లాభం వచ్చేందుకు వీలుంటుందని తెలిపారు. అనంతరం మహిళా మార్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను సైతం ఉన్నతాధికారులు పరిశీలించి, టీ స్టాల్ లో టీ ని సేవించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## సీఎంతో గద్దర్ అవార్డుల కమిటీ భేటి...

హైదరాబాద్,( తెలంగాణ ముచ్చట్లు):

గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డుల పై ప్రముఖ నటి జయసుధ నేతృత్వంలో ఏర్పాటైన సినీ అవార్డుల జూరి కమిటీ, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దీల్ రాజు ఆధ్వర్యంలో అవార్డుల ఎంపిక వివరాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అందజేసిన దృశ్యం.

# తెలంగాణ కాంగ్రెస్ కమిటీలకు ఏఐసీసీ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)



చోటు కల్పించనున్నారు. డీ లిమిటేషన్ కమిటీలో 7 మందికి అవకాశం ఇవ్వనున్నారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీలో మొత్తం ఏడు మంది సభ్యులు ఉండనున్నారు. పీఏసీ(పొలిటికల్ అఫైర్స్ కమిటీ)లో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు, ఇక అడ్వైజరీ కమిటీలో రేవంత్, జానారెడ్డి, మధుయాష్కీ, గీతారెడ్డిలు ఉండనున్నారు. డీలిమిటేషన్ కమిటీ చైర్మన్ గా వంశీచందర్ రెడ్డి నియమించారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా మల్లు రవి, 16 మందితో ఏర్పాటయ్యే సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ గా పి. వినయ్ కుమార్ లను నియమిస్తూ ఏఐసీసీ నిర్ణయం తీసుకుంది.

# కవిత ఏం మాట్లాడిందో తెలీదు: సబితా

హైదరాబాద్,( తెలంగాణ ముచ్చట్లు):

కవిత ఏం మాట్లాడిందో తనకు తెలీదని.. ఆమె వ్యాఖ్యలపై పార్టీ స్పందిస్తుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. విద్యను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. గత పదేళ్లలో విద్యకు కేసీఆర్ ఏం చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను వ్యతిరేకించడం లేదు. విధాన పరమైన నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నాం. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. రూ.80 కోట్లని ఒకసారి.. మరోసారి 125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం అన్నారు. ఇప్పుడేమో రూ. 200 కోట్లకు ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం అంటున్నారు. ఇలా ఎందుకు అంచనాలు పెంచుతున్నారు. ఒక్కో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కి ఎంత ఖర్చు పెడుతున్నారో చెప్పండి'' అంటూ సబితా ప్రశ్నించారు.

ఏడాది కాలంగా విద్యలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు?. ఎన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రణాళిక ఏంటో ప్రభుత్వం స్పష్టం చేయాలి. పెండింగ్ 8 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి. భవనాలు మాత్రమే కడితే సరిపోదు. సిలబస్‌లో ఏం మార్పు తెస్తున్నారు. ఆ స్కూళ్లలో ఎవరికి అడ్మిషన్స్ ఇస్తారు. సైనిక్, నవోదయ, మోడల్, మన ఊరూ మన బడి, మండల స్థాయి స్కూళ్లను ఏం చేస్తారో ప్రభుత్వం చెప్పాలి.

..మా హయంలో ఉద్యోగాలే ఇవ్వలేదనీ రేవంత్ మాట్లాడుతున్నాడు. ఏడాదికి మీరు ఇస్తామన్న ఉద్యోగాలు ఇచ్చారా?. కుల వృత్తులకు అండగా ఉండాలనే ఉద్దేశంతోనే బర్లు, గొర్లు పంచారు. రెసిడెన్షియల్ స్కూల్లో పిల్లలతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు.'' అంటూ సబితా మండిపడ్డారు.

# ఎంపీగా ఓడించడం కుట్రే!

హైదరాబాద్,( తెలంగాణ ముచ్చట్లు):

భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు తాను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఎలా లీక్ అయిందని ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. కట్టడి చేయమంటే పెయిడ్ సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారని ఆరోపించారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.

**లీకు వీరులను ఎండగట్టమంటే నాపై ప్రతాపమా?**

''కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే నేతలెవరూ స్పందించకపోతే ఎలా? నాకు నీతులు చెబుతూ కోవర్టులు ఉన్నారంటున్నారు. నా మీద పడి ఏడిస్తే ఎలా?ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా? లిక్కర్ కేసు సమయంలో రాజీనామా చేస్తానంటే కేసీఆర్ వద్దని వారించారు. ఎంపీగా పోటీ చేస్తే సొంత పార్టీ వాళ్లే కుట్రపూరితంగా ఓడించారు. అదే జిల్లాలో ప్రొటోకాల్ ఉండాలని కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చారు. లీకు వీరులను ఎండగట్టమంటే నాపై ప్రతాపం చూపుతున్నారు. కాంగ్రెస్, భాజపాపై మాట్లాడాలి కానీ.. నాపై దాడి చేస్తే ఎలా?

**జైలులో ఉన్నప్పుడే ఆ ప్రతిపాదన వస్తే వ్యతిరేకించా**

భారాసను గంపగుత్తగా భాజపాకు అప్పగించాలన్న ప్రయత్నం జరుగుతోంది. జైలులో ఉన్నప్పుడే ఆ ప్రతిపాదన వస్తే నేను వ్యతిరేకించాను. భాజపాలో భారాస విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం. నాపై దుష్ప్రచారం చేస్తున్నా పార్టీ స్పందించ లేదు. నన్ను పార్టీ నుంచి ఎవరు బయటకు పంపుతారు?.. అంత సీన్ లేదు. కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపినట్లు జరుగుతున్న ప్రచారం శుద్ధ అబద్ధం. భారాసలో కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు.. ఆయన నాయకత్వంలోనే పనిచేస్తాను. వెన్నుపోటు పొడవడం నా లక్షణం కాదు... నేరుగానే పోరాడతాను. కొత్త పార్టీ అవసరం లేదు.. ఉన్న పార్టీని బాగా చూసుకుంటే చాలు. లేఖలో నేను చేసిన సూచనల్లో ఒక్కటైనా తప్పుందా? కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లు అయ్యారా? కడుపులో విషం పెట్టుకుని బయటకు నవ్వుతూ ఉండలేను. నా తండ్రికి వందల లేఖలు రాశాను.. తప్పేంటి?సాధారణంగా కేసీఆర్ లేఖను చదివాక చింపుతారు. ఈసారి అలా చింపలేదు. కుట్ర ఎవరు చేశారో నాకు తెలియదు... బయటపెట్టాలని అంటున్నాను. లీకు వీరుడా.. లీకు వీరులా? అనేది తెలియాలి.

**కడుపులో బిడ్డను పెట్టుకుని ఉద్యమంలో పనిచేశా**

దేశం వెలుపల ఐటీ సెల్‌లు పెట్టి నాపై పోరాడుతామంటే ఎలా?దొంగల్ని పట్టుకోమంటే చేతగాక నాపై ప్రతాపం చూపితే ఎలా? పార్టీ నాది అని ప్రతి ఒక్కరూ పోరాడితేనే ఫలితం ఉంటుంది. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే.. కేవలం 'ఎక్స్'లో పోస్టు పెట్టి వదిలేస్తే ఎలా? నేను ఏనాడూ పదవుల కోసం పోరాడలేదు. కడుపులో బిడ్డను పెట్టుకుని తెలంగాణ ఉద్యమంలో సైనికురాలిగా పనిచేశాను. నన్ను విమర్శిస్తున్న నేతలు కేసీఆర్ నీడన ఉన్నారు తప్ప.. చేసిన కార్యక్రమాలు ఏమున్నాయి? వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఇవ్వాల్సిన ప్రొటోకాల్.. గౌరవం ఉంటుంది. తెలంగాణ జాగృతి ఉద్యమ సంస్థ.. అది ఇవాళ పుట్టింది కాదు. పార్టీ చేయని కార్యక్రమాలను జాగృతి తరపున చేస్తున్నాను. సాంస్కృతిక, సమకాలీన అంశాలపై బలంగా పోరాడాం.

**నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర..**

నా తండ్రిని, నా కుటుంబాన్ని వదిలి నేనెందుకు వెళ్తాను?నా కుటుంబానికి నన్ను దూరం చేసే ప్రయత్నం జరుగుతోంది. దూరం చేస్తే ఎవరికి లాభం జరుగుతుందో ఆలోచించుకోవాలి. నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర చేస్తున్నారు. నేను ఎవరి నాయకత్వం కింద పనిచేయను.. కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు. దామోదర్‌రావు, గండ్ర మోహన్‌రావును ఎవరు పంపారో నాకు తెలియదు. వాళ్లిద్దరూ ఎవరికి దగ్గరో తెలుసు కదా! వేరే నేత అంశంలో స్పందించిన పార్టీ.. నా విషయంలో ఎందుకు స్పందించడం లేదు? భారాస బలహీనమైతే కాంగ్రెస్, భాజపాలకు లాభం చేకూరుతుంది. కేసీఆర్ ఎలాంటి తప్పు చేయలేదు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.. అందులో ఎలాంటి అనుమానం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి కానీ.. 'ఎక్స్'లో పోస్టులకు పరిమితమైతే ఎలా?'' అని కవిత ఘాటుగా వ్యాఖ్యానించారు.







# భూ భారతిలో సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకం

- లైసెన్స్ సర్వేయర్ల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమం పరిశీలించిన
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.
- మొదటి విడతలో (111) మందికి శిక్షణ.
- 50 రోజుల పాటు సర్వేయర్ ల శిక్షణ కార్యక్రమం

మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు.

మెదక్: పౌరుల భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి భూమి హక్కుల రికార్డు చట్టం 2025ను అమల్లోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.
గురువారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఐటిఐ దగ్గర ఉన్న ఆర్ట్స్ కళాశాలలో లైసెన్సు సర్వేయర్ ల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. లైసెన్సు సర్వేయర్ శిక్షణలో భాగంగా వీరందరికీ అనుభవజ్ఞులైన వారిచే సర్వే శిక్షణను 50 రోజుల పాటు అందిస్తారని, ఈ లైసెన్స్ సర్వేయర్లకు భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు, హక్కులు, తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు. భూముల లావాదేవీలు జరిగినప్పుడు సర్వే చేసి, హద్దులను నక్షాలో పొందుపరిచిన తర్వాత రిజిస్ట్రేషన్లు చేసే విధంగా రానున్న రోజులో చర్యలు తీసుకోబడుతాయని, దీంతో తగాదాలకు చోటు ఉండదని వివరించారు. సర్వేయర్ లు శ్రద్ధగా ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి పరీక్ష పెట్టి, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ధ్రువీకరణ పత్రం ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భూములు, సర్వే ఏడీ. శ్రీనివాస్ సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా పశువులను తరలిస్తే చర్యలు తీసుకుంటాం

- పెద్దమందడి ఎస్ఐ శివకుమార్ యాదవ్

వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:

బక్రీద్ పండుగ సందర్భంగా పశువులను అక్రమ రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దమందడి ఎస్సై శివకుమార్ హెచ్చరించారు. పెద్దమందడి మండలం బుర్రవాగు దగ్గర ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ ప్రదేశంలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనుమానాస్పద వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అనుమతి లేకుండా పశువులను అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. అక్రమ రవాణా పేరుతో గొడవలు సృష్టిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై శివకుమార్ హెచ్చరించారు.



# జిల్లాలో రికార్డు స్థాయిలోవరి ధాన్యం కొనుగోలు

**2,85,446.960 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటివరకుకొనుగోలు**

**579.96 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో వేగంగా చెల్లింపు**

- ఈ సంవత్సరం రబీ సీజన్లో సంవత్సరంలో 68,588 మంది రైతులకు ప్రయోజనం.
- 223 కేంద్రాల్లో కొనుగోలు పూర్తిచేసుకుని ముగించడం జరిగింది.
- తుది దశలో కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు.
- మరో వారం రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి.
- గతం కంటే వేగంగా రైతులకు చెల్లింపులు.
- హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలన
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.

మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు.



రబి సీజన్ కు ధాన్యం సేకరణ రికార్డు స్థాయిలో కొనుగోలు జరుగుతుందని గత సీజన్ లో ఈ రోజుతో పోలిస్తే ఈ రబీ సీజన్లో ఈ రోజు వరకు 25,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసి అతి వేగంగా రైతుల ఎకౌంట్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం హవేలీఘన్పూర్ మండలం బూరుగుపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తాసిల్దార్ సింధు రేణుక తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ
జిల్లాలో యాసంగి సీజన్ వడ్ల సేకరణ కోసం మొత్తం 496 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.
మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, గతంలో కంటే కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో రైతులకు వేగంగా చెల్లింపులు జరిగాయనీ, తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు తుది దశలో ఉన్నాయని మరో వారం రోజుల్లో జిల్లాలో అన్నీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలించటం జరుగుతుందని అన్నారు.
బూర్గుపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుధి దశలో ఉన్నందున త్వరితగతిన కేంద్రంలో ఉన్నధాన్యాన్నికొనుగోలు పూర్తి చేసి మిల్లుకు ధాన్యం తరలించాలని నిర్వహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రబీ 2023 24 సీజన్లో ఈరోజు వరకు 2,60,381.440 మెట్రక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 448.18 కోట్లు చెల్లింపులు జరిగాయని 61,108 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. 2024 2025 సంవత్సరం రబీ సీజన్లో 2952025 వ తేదీ నాటికి జిల్లాలో 2,85,446,960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 579.96. కోట్ల రూపాయలు రైతులకు చెల్లింపులు జరిగాయన్నారు. 68,588 మంది రైతులకు లబ్ధి చేకూరింది అన్నారు. గత సీజన్ తో పోలిస్తే ఈ రబీ సీజన్లో 25,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశామని తెలిపారు. చివరి గింజ వరకు దాన్యం సేకరిస్తామని స్పష్టం చేశారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. తడిసిన ధాన్యం సైతం సేకరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హవేలీఘన్పూర్ తాసిల్దార్ సింధు రేణుక సంబంధిత కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి పాలమూరు జిల్లాకు ట్రిపుల్ ఐటీ మంజూరు

- సిఎం కు కృతజ్ఞతలు తెలిపిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:



ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు పాలమూరులోనే విద్యాబోధన అందించే విధంగా ఉమ్మడి పాలమూరు జిల్లా జాతీయ రహదారి పక్కన దివిటిపల్లి దగ్గర ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు జారీ చేస్తూ గురువారం జీవో ఎం ఎస్ నంబర్ 24ను జారీ చేసింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు,వాకిటి శ్రీహరి ముదిరాజ్, తూడి మేఘారెడ్డి,యెన్నం శ్రీనివాసరెడ్డి,జి.మధుసూదన్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, చిట్టెం పర్ణికరెడ్డిలు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన ఆయన ఉమ్మడి పాలమూరు జిల్లాలోని దివిటిపల్లి దగ్గర ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు వారు పేర్కొన్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రిపుల్ ఐటీ మంజూరుకి సహకరించిన రాష్ట్ర ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ,జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు,నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి లకు ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలియజేశారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో ట్రిపుల్ ఐటీ నిర్మాణం చేపడితే ఉన్నత విద్యను అభ్యసించే నిరుపేద విద్యార్థులందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీ తరలింపుపై సీఎంని కలిసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:



బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ)ను మహబూబ్ నగర్ జిల్లాలో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం సందర్భంగా, జిల్లాకు చెందిన శాసనసభ్యులు ముఖ్యమంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.
జూబ్లీహిల్స్‌లోని నివాసంలో జరిగిన ఈ భేటీలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జనంపల్లి అనిరుధ్ రెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి, తూడి మేఘా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్ నగర్ జిల్లా విద్యారంగ అభివృద్ధికి ట్రిపుల్ ఐటీ కొత్త క్యాంపస్ దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.



## బిఆర్ఎస్ కార్యకర్త కుమార్తె ని-శ్చితార్థానికి హాజరైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి,తెలంగాణ ముచ్చట్లు:

పెద్దమందడి మండలం దొడ గుంట పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కొమ్ము శాంతన్న, అంజలమ్మ దంపతుల కుమార్తె నిశ్చితార్థానికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు.గురువారం దొడగుంటపల్లె లో జరిగిన నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విట్ట వెంకటేశ్వర రెడ్డి,సింగల్ విండో మెంబర్ వెంకటేశ్వర పూజ రెడ్డి,కొమ్ము చెన్నయ్య,గజ్జారాములు,కొమ్ము మన్నెం,పానుగంటి సురేష్ కుమార్, కొమ్ము శ్రీనివాసులు,గోపల్పేట్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ వద్దేమన్ రవి,సోషల్ మీడియా ఇన్చార్జి నాగరాజు కొమ్ము తిర్మలయ్య తదిరులు పాల్గొన్నారు.



# గోపాలపూర్ చెరువు సుందరి కరణ పేరిట పేదల తరిమివేతకు ప్రయత్నం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శికి వివరించిన హనుమకొండ కమిటీ

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:

రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హనుమకొండ జిల్లాకు తొలిసారిగా వచ్చిన సందర్భంగా, సిపిఎం హనుమకొండ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేసి, గోపాలపూర్ గుడిసేవాసుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చెరువు సుందరి కరణ పేరిట పేదవారిని తొలగించేందుకు అధికార పార్టీలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ చర్యలను తక్షణమే విరమించాలని, చెరువులో కబ్జయిన భూమిని తిరిగి పొందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
వడ్డేపల్లి చెరువు నుంచి తులసిబారు వరకు డ్రాప్ వాల్ నిర్మించి వరద ముప్పు నుంచి కాలనీలను రక్షించాల్సిందిగా, శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమస్యలన్నింటిని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ దృష్టికి తీసుకెళ్లిన సందర్భంగా, పేదల సమస్యల పరిష్కారానికి సిపిఎం పార్టీ పూర్తిగా మద్దతుగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. పేదల గుడిసెలను కాపాడేందుకు అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమని, ప్రభుత్వాలు కబ్జాదారుల పక్షాన నిలబడతాయా? లేక పేదల పక్షాన నిలబడతాయా? అనేది చూపించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. చెరువులో గుడిసెలు వేసుకున్న పేదలకి ఇంటి పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ప్రభుత్వ చిత్తశుద్ధిని చూపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం హనుమకొండ పశ్చిమ మండల కార్యదర్శి వీ. వీరన్న, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, మండల కమిటీ సభ్యులు వీ. రాజు, శాఖ కార్యదర్శి చారి, జగన్, రమేష్, సబితా, రాధిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# బెల్టు షాపులతో మా జీవితాలు బుగ్గిపాలు!

- మద్యపాన నిషేధ పోరాట కమిటీ ఎన్నిక!

సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:



వేంసూరు మండలం: మద్యం బెల్టు షాపులతో మా జీవితాలు బుగ్గిపాలు అవుతున్నాయని ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని శంభునిగూడెం గ్రామానికి చెందిన ఉపాధి హామీ మహిళా కార్మికులు గురువారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. భర్తలే కాకుండా చిన్నారులు కూడా మద్యానికి బానిసలు అవుతున్నారని కొందరు మహిళలు ఊరు వదిలి వెళ్లిపోయారని వెంటనే మద్యం బెల్టు షాపులను ఎత్తివేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ పెద్దలు అర్వపల్లి జగన్మోహన్ రావు, నరసింహారావు, వెంకటేశ్వరరావు, పౌరహక్కుల నేత మల్లూరు చంద్రశేఖర్ ల సమక్షంలో గ్రామంలోని రైతువేదిక ఎదుట అమరజీవి తాళ్ల వెంకటాద్రి స్థూపం వద్ద గ్రామ మద్యపాన నిషేధ పోరాట కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమస్య పరిష్కారం కోసం ఐక్య పోరాటం చేస్తే పరిష్కారం అవుతుందని ఐక్యంగా ఉండాలని పెద్దలు సూచించారు. కమిటి సభ్యులుగా అన్నీబోయిన తిరుపతమ్మ,తాళ్ళ త్రివేణి, ఈదా ముత్తమ్మ,జువ్వుల వీరలక్ష్మి, మారాగాని రాధమ్మ,,ఇండ్ల పద్మ, జగం మారేశ్వరి, జుంజు ముత్తమ్మ,తాళ్ళ కృష్ణమ్మ, జువ్వల కాసు, బాజినీని నాగేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శుక్రవారం-30- మే 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి..

(మొదటి పేజీ తరువాయి)




సమీక్ష లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల కారణంగా రైతులు పెట్టే లక్షల రూపాయల పెట్టుబడి, వారి కష్టం వృధా అవుతుందని అన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అవసరమైన సహకారం తీసుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వారికి పుట్టగతులు లేకుండా చేయాలని అన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు కూడా పూర్తి చేశామని అన్నారు. 5 లక్షల రూపాయలతో పేదలకు ఇండ్లు కట్టించే పథకం దేశంలో ఎక్కడా లేదని, ఒకేసారి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేయడం చాలా సాహసోపేతమైన నిర్ణయమని అన్నారు. 22 వేల 500 కోట్లతో 4 లక్షల 50 వేల ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని అన్నారు. మనిషికి భూమికు ఉన్న అనుబంధం గత ప్రభుత్వం ధరణి పేరుతో చాలా ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. భూ భారతి చట్టంతో ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజలకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తూ మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందే వివిధ పథకాలు వివరించాలని అన్నారు. ఉదయం జాతీయ పతాకావిష్కరణతో పాటు సాయంత్రం అసెంబ్లీ నియోజకవర్గం హెడ్ క్వార్టర్ లో వేడుకలు నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

త్రాగునీటి సరఫరా ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఆసుపత్రి నిర్వహణ పకడ్బందీ ఉండాలని, అవసరమైన మందుల స్టాక్ పంపుతున్నామని, ప్రతి నెలా ఆరోగ్య శ్రీ, డ్రగ్స్ చెల్లింపులు పూర్తి చేస్తున్నామని అన్నారు.

సమీక్ష లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖల మంత్రివర్యులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాల పై తీసుకుంటున్న చర్యలు వెంటనే పత్రికలు, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ర్యాండమ్ గా చెక్ చేయాలని, అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు చేరాలని మంత్రి సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్స్ మంజూరు చేయడంతో పాటు నిర్మాణ పనులు పురోగతిని కూడా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు బాగా జరుగుతున్నాయని, ఈ సంఖ్య మరింత పెరగాలని అన్నారు. రుతుపవనాలు ముందుగా వచ్చిన నేపథ్యంలో వానాకాలం పంట సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందు బాటులో పెట్టాలని అన్నారు. రాష్ట్రంలోని పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థ బాగు చేస్తూ ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పనులు 200 కోట్లతో ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు.

సమీక్ష లో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఎరువుల, విత్తనాల కొరత రాకుండా జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉంటుందని అన్నారు. స్టాక్ వివరాలను రెగ్యులర్ గా మానిటర్ చేస్తూ ప్రతి మండలంలో అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువుల స్టాక్ అందుబాటులో ఉండాలని అన్నారు.

సమీక్ష లో రెవెన్యూ , హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అసైన్మెంట్ భూములలో పోజిషన్ లో ఉన్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన ఉందని, వీటికి సంబంధించి ప్రతిపాదనలు ఉంటే సమర్పించాలని అన్నారు. సాదా బైనామా సంబంధించి ప్రభుత్వ భూములకు కూడా కొంతమంది దరఖాస్తులు చేసుకున్నారని, వీటిని తక్షణమే తిరస్కరించాలని మంత్రి ఆదేశించారు.

హై కోర్టు నుంచి స్టే తొలగిన వెంటనే అర్హత ఉన్న సాదా బైనామాలను పరిష్కరిస్తామని అన్నారు. జూన్ 3 నుంచి జూన్ 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాలలో తహసిల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని మంత్రి ఆదేశించారు.

దేశంలో ఎక్కడా పేదలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వడం లేదని, లబ్ధిదారులను పూర్తి పారదర్శకంగా, నిరు పేదలను ఎంపిక చేయాలని అన్నారు. ఒత్తిడులకు లోనై అనర్హులకు ఎక్కడైనా ఇండ్లు మంజూరు చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పెట్టుబడి సొమ్ము లేకపోతే మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయాలని మంత్రి తెలిపారు. జూన్ 10 లోపు పైలెట్ ప్రాజెక్టు క్రింద మంజూరు చేసిన ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి కావాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు కోసం అవసరమైన ఇసుక లబ్దిదారులకు టోకెన్ ద్వారా ఉచితంగా అందించాలని, ఇందిరమ్మ ఇండ్ల పేరిట అక్రమ ఇసుక రవాణా జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. ఇంటి నిర్మాణం పరికరాల ధరల నియంత్రణ కు కలెక్టర్ లు చర్యలు తీసుకోవాలని అన్నారు. సగం దశలో మిగిలిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. నీటి పారుదల శాఖ పరిధిలో పెండింగ్ ఆపరేషన్ అండ్ మేయింటెనెన్స్ పనులు ప్రాధాన్యత క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని మంత్రి సూచించారు. పేదల సంతోషం కోసం ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.

ఎంపి రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఉన్న సందేహాలను మంజూరు పత్రాల పంపిణీ సమయంలో నివృత్తి చేయాలని అన్నారు.

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్ లో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేశామని, లక్షా 21 వేల మెట్రిక్ సన్న రకం ధాన్యం, 95 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి బోనస్ తో సహా చెల్లింపులు పూర్తి చేశామని అన్నారు. వరంగల్, హన్మకొండ ప్రాంతాల్లో కూడా రైస్ మిల్లులకు అలాట్మెంట్ చేశామని అన్నారు. సన్న రకం ధాన్యంకు బోనస్ ప్రకటించడంతో ఖమ్మం జిల్లాలో సాగు పెరిగిందని, రాబోయే వానాకాలం పంట దాదాపు 6 లక్షల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తున్నా మని కలెక్టర్ తెలిపారు. ఎక్కడా కల్తీ విత్తనాల విక్రయం జరగకుండా జాగ్రత్త వహిస్తున్నామని అన్నారు. గ్రామంలో ఎక్కడైనా కల్తీ విత్తనాలు విక్రయాలు జరిగితే వెంటనే సమాచారం తెలిసేలా వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఎరువుల లభ్యతపై రెగ్యులర్ గా సమీక్ష చేసుకుంటూ ఎక్కడా కొరత రాకుండా చూస్తామని అన్నారు.

నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టు క్రింద రెవెన్యూ సదస్సులు నిర్వహించామని అన్నారు. భూ సమస్యలపై నేలకొండపల్లి మండలంలో ప్రజల నుంచి 3224 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1791 సాధా బైనామా దరఖాస్తులు ఉన్నాయని, ఫీల్డ్ సర్వే చేసి డాక్యుమెంట్ ఉన్న అర్హులకు సమస్య పరిష్కరించి పట్టాలను పంపిణీ చేస్తామని అన్నారు. మిగిలిన 1433 పైగా దరఖాస్తులో ఎక్కువ శాతం సర్వే నెంబర్ విస్తీర్ణం, సర్వే నెంబర్ పాస్ బుక్ లో ఎక్కలేదని దరఖాస్తులు వచ్చాయని, క్షేత్ర స్థాయి ఎంజాయ్ మెంట్ సర్వే చేసి 299 దరఖాస్తులు ఆమోదించామని, ప్రతి తిరస్కరించిన దరఖాస్తుకు కారణం స్పష్టంగా తెలియ జేస్తున్నామని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు మంజూరు చేసిన 800 పైగా ఇండ్లలో 30 ఇండ్లు చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. 200 పైగా లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణం చేపట్టామని అన్నారు. రాబోయే వానాకాలం లోతట్టు ప్రాంతాలలో నీటి నిల్వ ఉండకుండా పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టామని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు.

కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నకిలీ విత్తనాలపై పటిష్టమైన విజిలెన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. కోర్టు స్టే తొలగిన వెంటనే సుజాత నగర్ పైలెట్ మండలంలో సాధా బైనామా సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను అర్హులకు పంపిణీ చేయాలని అన్నారు. ఇంటి నిర్మాణ సామాగ్రి తక్కువ ధరకు పేదలకు అందించాలని అన్నారు. జిల్లాలో కొన్ని చోట్ల రైస్ మిల్లుల వద్ద తరుగు పేరుతో ధాన్యం కోత విధిస్తున్నారని , దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని అన్నారు.

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు సజావుగా జరిగిందని, యాసంగి సీజన్ లో కొంత ఇబ్బంది జరిగిందని, వచ్చే సీజన్ లో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ గత ప్రభుత్వం లో గృహలక్ష్మి క్రింద బేస్మెంట్ స్థాయి వరకు నిర్మించి డబ్బులు రాకుండా నిలుపుదల అయిన వాటికి ఇల్లు పూర్తి చేసే విధంగా డబ్బులు మంజూరు చేయాలని, సత్తుపల్లి నియోజకవర్గ ప్రాంతంలో వైద్యుల కొరత ఉన్నదని, 100 పడకల ఆసుపత్రికి అనుగుణంగా వైద్యులను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి.రోహిత్ రాజ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్య నారాయణ, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ లు పి. శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్, డిఆర్వో ఏ. పద్మశ్రీ, ఉమ్మడి జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



---

## 30 రోజుల లోపు రావలసిన బకాయి వివరాలు అందించాలి ....

- **కో ఆపరేటివ్ సొసైటీ లిక్విడేటర్ అఖిలా బేగం**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

కోఆపరేటివ్ సొసైటీల నుండి రావలసిన నగదు బకాయి వివరాలు 30 రోజుల లోపు అందించాలని కోపరేటివ్ సొసైటీ జూనియర్ ఇన్స్పెక్టర్/ లిక్విడేటర్ ఎస్.డి. అఖిలా బేగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రఘునాధపాలెం మండలంలోని పంగిడి ఎస్టీ మహిళ లేబర్ కాంట్రాక్ట్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ను అలాగే ఖమ్మంకు చెందిన శ్రీ కనకదుర్గ స్టోన్ క్వారీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, డిస్ట్రిక్ట్ పారామెడికల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ లను లిక్విడేషన్ చేయడానికి తనను లిక్విడేటర్ గా జిల్లా సహకార అధికారి తెలంగాణ సహకార సంఘంలో చట్టం 1964 ప్రకారం నియమించారని తెలిపారు. ఈ మూడు కో ఆపరేటివ్ సొసైటీలకి సంబంధించి ఎవరికైనా నగదు రావాల్సినది ఉంటే తగిన ఆధారాలతో లిక్విడేటర్ కు 30 రోజులలోగా జిల్లా సహకార అధికారి కార్యాలయం, ఖమ్మం పాత డిఆర్డిఏ ఆఫీస్ పక్కన కలిసి సమర్పించాలని లేనియెడల చెల్లింపులు ఏమీ లేవని భావించబడుతుందని, గడువు లోపు ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే చెల్లింపులకు పరిశీలిస్తామని, ఇతర వివరాలకు సెల్ నెంబర్ 9676900083 నందు సంప్రదించాలని అఖిలా బేగం ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కొండపర్తి చెరువు కట్టు కాలువ మరమ్మత్తు పనులు ప్రారంభం

**ఐనవోలు,తెలంగాణ ముచ్చట్లు:**



హన్మకొండ జిల్లా ఐనవోలు మండలంలోని కొండపర్తి గ్రామ పెద్ద చెరువు వద్ద వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో కట్టు కాలువ మరమ్మతులు చేపట్టేందుకు ఇటీవల గ్రామస్థులు, స్థానిక నాయకులు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కోరారు.

దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, అవసరమైన మరమ్మతులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు నేడు చెరువు కట్టు కాలువ మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. గ్రామస్థులు చేపట్టిన ఈ వినతి నేపథ్యంలో చేపట్టిన చర్యలకు సంతృప్తి వ్యక్తం చేశారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి!

- **సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు: మాచర్ల భారతి**

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

స్థానిక సత్తుపల్లి పట్టణం రావి వీర వెంకయ్య భవన్ లో సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి వర్గ సమావేశం చలమాల విటల్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం సందర్భంగా సిపిఎంరాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని అర్హులైన లబ్ధిదారులకు రాజకీయాలకు అతీతంగా ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇల్లు పథకం అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగే విధంగా ఇండ్లు విషయంలో ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు లోబడకుండా అధికారులు సంబంధిత లబ్ధిదారులకు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం రాజు యువ వికాస్ కు ఇప్పటికే దరఖాస్తులు తీసుకునే ప్రక్రియ పూర్తి అయిన నేపథ్యంలో లబ్ధిదారులను గుర్తించి తక్షణమే వారికి రుణ సౌకర్యం అందే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిందన్నారు. ఆరుగారెంటీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2500 ఇస్తామని ₹ 2000 రూపాయలు పెన్షన్ను 4000 ఇస్తామని అన్నారు, అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ, రైతుబంధు ఇస్తామని, ప్రతి సంవత్సరం వ్యవసాయ కూలీలకు 12000 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నెరవేర్చని యెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, చలమాల విట్టల్ రావు, సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, సిపిఎం తల్లాడ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు, సిపిఎం నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక అందించేందుకు ఇసుక రీచులను గుర్తించాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

మన ఇసుక వాహనం ద్వారా గృహ నిర్మాణాలకు ఇసుక అందించేందుకు మరిన్ని ఇసుక రీచ్ లను గుర్తించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.గురువారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్లు జిల్లా స్థాయి సౌండ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కమిటీ ద్వారా జిల్లాలో కొత్తగా ఎక్కడెక్కడ ఇసుక రీచులు గుర్తించారు.వాటి భౌగాలిక పరిస్థితులు ఏమిటి అనేది చర్చించారు.వీపనగండ్ల మండలం తూముకుంట. గ్రామం వీర రాఘవపూర్ ఇసుక రీచ్ లో 3990 క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉందని ఇరిగేషన్ భూగర్భ జలాలు మైన్స్ అండ్ జియాలజీ ద్వారా పరిశీలన చేసిన రిపోర్టును వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముందు ఉంచారు.వీరరాఘవపూర్ రీచ్ నుండి మన ఇసుక వాహనం ద్వారా ఇసుక తీసుకునేందుకు కమిటీ తీర్మానం చేసింది. మదనాపూర్ మండలం లోని కొత్తపల్లి.దుప్పల్లి రీచులను పరిశీలించడం జరిగిందని అక్కడ నిబంధనలకు అనుగుణంగా ఇసుక లభ్యత లేదని మైన్స్ అధికారి తెలపగ ఆన్లైన్ యాప్ ద్వారా పరిశీలన కలెక్టర్ కమిటీ సభ్యులు మరోమారు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. పెద్దమందడి మండలం చిలుకటోనిపల్లి, కరివేనా గ్రామంలో లోని రీచులను సైతం పరిశీలించడం జరిగిందని అక్కడ నిబంధనల ప్రకారం ఉండాల్సిన లభ్యత లేదని అందువల్ల రీచ్ గా పరిశీలించి ఇసుక తీసుకోలేమని కమిటీ నిర్దేశించింది. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి. వనపర్తి జిల్లా అదనపు ( రెవెన్యూ) కలెక్టర్ జి .వెంకటేశ్వర్లు, వనపర్తి జిల్లా మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్,ఏ.డి మైన్స్ గోవిందు రాజులు. భూగర్భ జలాల ఏ.డి దివ్య జ్యోతి. డి ఎల్ పి ఓ రంగనాథ్. రాజేష్. తదితరులు పాల్గొన్నారు.



TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# తెలుగు చిత్రసీమలో దాసరిది నూతన ఒరవడి

తెలుగు సినిమా రంగంలో ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. చిత్ర నిర్మాణంలో ఏ విభాగంలో నైనా ఆయనది ప్రత్యేక శైలి. అయన ప్రత్యేక గుర్తింపు పొందిన సినిమా దర్శకులు, విలక్షణ నటులు, గీత, సంభాషణ రచయిత, చిత్ర నిర్మాత. అత్యధిక చిత్రాల దర్శకునిగా తెలుగు, హిందీ భాషల్లో 151 సినిమాలకు దర్శకత్వం వహించడం ద్వారా 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'ల్లోకి ఎక్కారు. గిన్నిస్ బుక్ లో స్థానం పొందారు. 53 సినిమాలు స్వయంగా నిర్మించారు. 250 పైగా చిత్రాలలో సంభాషణ రచయితగా లేదా గీత రచయితగా పని చేశారు. తెలుగు, తమిళం , కన్నడ భాషా చిత్రాలలో నటించి, నటనకుగాను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ నటునిగా బహుమతి కూడా పొందారు. అంతేకాదు రాజకీయ నాయకులు, కేంద్ర మంత్రిగా సుపరిచితులు. ఆయనే బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి నారాయణరావు. దాసరి నారాయణరావు ( మే 4, 1947 - మే 30, 2017) కళాశాలలో చదివే రోజులలో బీ.ఏ డిగ్రీతో ఉత్తీర్ణులు కావడంతో పాటు దాసరి అనేక నాటక పోటీలలో కూడా పాల్గొనేవారు. అనతి కాలంలోనే ప్రతిభ గల రంగ స్థల నటుడిగా, నాటక రచయితగా చిత్ర దర్శకుడిగా గుర్తింపు పొందారు. మోహన్ బాబు, ఆర్. నారాయణమూర్తి, కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు, రవిరాజా పినిశెట్టి తదితర నటులు, దర్శకులు, ఎందరో సాంకేతిక నిపుణులను దాసరి తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు. సినీ రంగానికి పరిచయం చేసి ఎదిగేందుకు చేయూత అందించారు. ఒక సమయంలో ఆయన పేరిట తెలుగు నేలపై 18వందలకు పైగా దాసరి అభిమాన సంఘాలు ఉండేవంటే సామాన్యం కాదు. ఆదుర్తి సుబ్బారావు దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా, శిష్యరికం చేసి సినిమా దర్శకత్వంలో తనకంటూ ఓ ప్రత్యేకశైలిని అలవర్చుకున్నారు. తర్వాత భిన్నమైన చిత్రాలను రూపొందించారు. 1974లో తాతా మనవడు సినిమాతో సినీ ప్రస్థానం ప్రారంభించిన దాసరి తొలి సినిమాకే నంది అవార్డు అందుకొని సంచలనం సృష్టించారు. తాతా మనవడు, స్వర్గం నరకం, మేఘసందేశం, మామగారు అనేక అవార్డులు తెచ్చిపెట్టాయి. మేఘ సందేశం చిత్రాన్ని కేన్స్, షికాగో, మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించారు. దాసరి తిసిన బొబ్బిలి పులి , సర్దార్ పాపారాయుడు చిత్రాలు నందమూరి తారక రామారావు రాజకీయ ప్రవేశములో ప్రధానపాత్ర వహించాయి. మామగారు, సూరిగాడు, ఒసేయ్ రాములమ్మ చిత్రాలు దాసరి నటనా కౌశలానికి మచ్చు తునకలుగా మిగిలాయి. ఆ సినిమాలలో నటనకు దాసరి అనేక విమర్శకుల ప్రశంసలు, బహుమతులు అందుకున్నారు.

1947, మే 4న పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లులో జన్మించారు. ఆయన తండ్రి తరం వరకూ వారి కుటుంబంలో ఎవరూ చదువుకోలేదు. దాసరిని చదివించే క్రమంలో, ఆరో తరగతి కొచ్చేసరికి వారి ఆర్ధిక పరిస్థితి బాగా దెబ్బతింది. స్కూలు ఫీజు మూడుం పావలా కట్టడానికి కూడా డబ్బులేక బడి మాని, ఒక వడ్రంగి దుకాణంలో నెలకు రూపాయికి పని చేయాల్సి వచ్చింది. అయితే ఒక మాస్టారు సాయంతో మళ్ళీ చదువు కొనసాగించారు.రామోజీ రావు వార్తాపత్రిక ఈనాడుకు ధీటుగా భావించి ఉదయం దినపత్రికను ఆయన ప్రారంభించి, కొత్త జర్నలిజానికి పురుడు పోశారు. ఎందరినో జర్నలిస్టులు తీర్చిదిద్దారు. రాజీవ్ గాంధీ పాలనా కాలములో, దాసరి కాంగ్రెస్ పార్టీ పక్షాన ఔత్సాహికులై ఎన్నికల ప్రచారము సాగించారు. రాజీవ్ హత్యానంతరం పార్టీకి కాస్త దూరంగా జరిగారు. 1990 దశకం చివరిలో ఆయన తెలుగు తల్లి పేరిట రాజకీయ పార్టీని ప్రారంభించారు. ఈ పార్టీకి కోస్తా ప్రాంతాలలోని కాపు వర్గాల నుండి మంచి స్పందన లభించింది. తర్వాత మాత్రం కాంగ్రెస్ పార్టీకి అనుకూలురై, కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నిక అయ్యారు. బొగ్గు, గనుల శాఖకు కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. సోనియా గాంధీకి సన్నిహితులుగా మెదిలారు. 1974లో తాతా మనవడు చిత్రానికి నంది అవార్డు, స్వర్గం నరకం సినిమాకు ఉత్తమ చిత్రంగా బంగారు నంది బహుమతి , 1983లో మేఘ సందేశం చిత్రానికి గాను ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డు, 1992లో మామగారు చిత్రానికి గాను ఉత్తమ నటుడు నంది అవార్డు, 1986లో తెలుగు సంస్కృతి , తెలుగు చిత్ర రంగం నకు ఆయన చేసిన సేవలకు గాను ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, ఫిల్మ్ ఫేర్ అవార్డు 6 సార్లు, మద్రాసు ఫిల్మ్ ఫాన్స్ అవార్డ్ 5 సార్లు, సినీ హెరాల్డ్ అవార్డ్ 10 సంవత్సరాలు వరసగాను పొందారు. జ్యోతిచిత్ర నుండి సూపర్ డైరెక్టర్ అవార్డ్ కు 3 సార్లు, పాత కాలం నాటి ఆంధ్రపత్రిక నుండి ఉత్తమ దర్శకుడిగా 6 సార్లు ఎంపిక అయ్యారు. తెలుగు సినీ పరిశ్రమలో ఎన్టీఆర్, దాసరి నారాయణ రావు సూపర్ హిట్ కాంబినేషన్ కాగా... ఎన్టీఆర్ రాజకీయాల్లో ప్రవేశించిన సమయానికి దాసరి తెరకెక్కించిన చిత్రాలు ప్రధాన పాత్రలు పోషించాయి. ఎన్టీఆర్, దాసరి నారాయణ రావు కలయికలో మొదటి సారి 'మనుషులంతా ఒక్కటే' సినిమా రాగా, బాక్సాఫీస్ సూపర్ హిట్‌గా నిలిచింది. ఎన్టీఆర్, దాసరి నారాయణ రావు కలయికలో వచ్చిన రెండో చిత్రం 'సర్కస్ రాముడు'. మూడో చిత్రం 'సర్దార్ పాపారాయుడు'. నాలుగో చిత్రం 'విశ్వరూపం'. ఐదో చిత్రం 'బొబ్బిలి పులి' ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సక్సెస్ అయింది. తెలుగు ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన దాసరి నారాయణరావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ 2017 మే 30న మరణించారు.

# నేతల మాటలు.. రగిలిన మంటలు

బాధ్యతాయుతమైన వ్యక్తులు మాట్లాడే మాటలు, వ్యవహార శైలి సమాజంలో సామాన్య ప్రజానీకానికి ఆదర్శంగా ఉండాలి. రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉన్న ఎంఎల్ఎలు, ఎంపిలు, మంత్రులు జాతి గౌరవాన్ని, దేశ సమగ్రతను పెంపొందించే విధంగా మాట్లాడాలి. దురదృష్టవశాత్తు నేడు దేశంలో ప్రజాప్రతినిధులు మాట్లాడే భాష రోజుకురోజుకూ దిగజారిపోతోంది. జాతి ఐక్యతకు పాటుపడుతామని ప్రమాణం చేసిన వారే జాతి సమగ్రతకు హాని కలిగించేలా మాట్లాడుతున్నారు. ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకొని సైనికుల త్యాగాలను, సామర్థ్యాన్ని కీర్తిస్తూ వారికి అండగా ఉండాల్సిన రాజకీయ నాయకత్వం సైనికులను అవమానకరపు మాటలతో వేధిస్తోంది. కులాలను, మతాలను సైన్యానికి ఆపాదిస్తూ దిగజారుడు మాటలతో దేశపరువును మంటగలుపుతున్నారు. వారానికో ఎపిసోడ్ మాదిరిగా ప్రజాప్రతినిధులు చేస్తోన్న అడ్డగోలు, రోత వ్యాఖ్యలతో ప్రజలు దిగ్భ్రాంతికి లోనవుతున్నారు. సైన్యాధికారిణి కల్నల్ సోఫియా ఖురేషిపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా నిసిగ్గుగా చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దేశప్రతిష్టను దిగజార్చాయి. ఆపరేషన్ సింధూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలు అందించిన కల్నల్ సోఫియా ఖురేషికి మతాన్ని ఆపాదిస్తూ ఉగ్రవాదుల సోదరిగా వర్ణించి దేశగౌరవానికి తలవంపులు తెచ్చాడు. మంత్రి విద్వేషపు మాటలపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించింది. చివరకు ఆ రాష్ట్ర హైకోర్టు మంత్రి వ్యాఖ్యలను సుమోటాగా తీసుకుని కేసు పెట్టమని ఆజ్ఞాపించటంతో అతని నోటిదూల తీవ్రత తెలుస్తోంది. హైకోర్టు కేసు నుంచి విముక్తి కోసం విజయ్ షా సుప్రీం కోర్టు మెట్లెక్కితే క్షమాపణలు చెప్పమని ఆజ్ఞాపించింది.

విజయ్ షా క్షమాపణ చెప్పిన విధానాన్ని కూడా సుప్రీం కోర్టు ఆక్షేపించింది. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి అభ్యంతరం ఏంటని నిలదీసింది. ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయమని మధ్యప్రదేశ్ డిజిపిని ఆదేశించడంతో సిట్ ఏర్పాటు కాబడి మంత్రి వ్యాఖ్యలపై దర్యాప్తు చేస్తోంది. మంత్రి నోటి దురుసుతనంపై దేశంలోని వివిధ వర్గాల ప్రజలు, మేధావులు నిరసనను వ్యక్తం చేసినప్పటికీ మధ్యప్రదేశ్ ప్రభుత్వం అతనిని మంత్రివర్గం నుంచి తప్పించే ప్రయత్నం చేయలేదు. సుప్రీం కోర్టు ఈ వ్యవహారంలో పలు దఫాలుగా విజయ్ షా వ్యాఖ్యలపై అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేసినప్పటికీ భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం అతనిపై ఏ చర్యా తీసుకోకపోవడం దేశప్రజలను కలవరపెడుతోంది. ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు మాజీ ఎంపి రామ్ గోపాల్ యాదవ్ బిజెపి నాయకులకు తానేమి తక్కువ కాదన్నట్లు అవాకులు, చవాకులు పేలాడు. సైనికాధికారులకు కులం, మతం అంటగడుతూ విద్వేషాన్ని రాజేశాడు. కల్నల్ సోఫియా ఖురేషిని మత ప్రాతిపదికపై బిజెపి మంత్రి విమర్శలు చేశాడని తను పనికిమాలిన వ్యాఖ్యలు చేశాడు. కల్నల్ సోఫియా ఖురేషితోపాటు మీడియా బ్రీఫింగ్‌లో పాల్గొన్న వింగ్ కమాండర్ వ్యామికా సింగ్, వైమానిక దాడులను వివరించిన ఎయిర్ మార్షల్ ఎకె భారతి కులాలను ఎంచి అనుచితంగా మాట్లాడాడు. రాజకీయ నాయకులు ఓటు బ్యాంకును స్థిరం చేసుకోవడానికి దేశంలో కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడం పరిపాటి. దేశ రక్షణకోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడి పనిచేసే సైనికుల మధ్య కులాల అడ్డుగోడలు కట్టడం సరైంది కాదనే ఇంగిత జ్ఞానం కూడా అతనికి లేకపోయింది. రేయింబవళ్లు కంటిమీద కునుకు లేకుండా సరిహద్దులో కాపలాకాస్తున్న సైన్యానికి కులాల, మతాల ముసుగు తొడగడంతో పొరుగు దేశాల ముందు దేశం పరువు మసకబారింది.

మధ్యప్రదేశ్ మంత్రి మాట్లాడిన మాటల మంటలు చల్లారక ముందే ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా ప్రజలపై, సైన్యంపై విషం చిమ్మాడు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైనందుకు ప్రజలు, సైన్యం ప్రధాని మోడీ కాళ్లకు మొక్కాలని అవమానించే రీతిలో మాట్లాడాడు. వాస్తవానికి ఇతరులకు గౌరవ మర్యాదలు ఇవ్వడంలో మోడీ ఎప్పుడు ముందుంటారు. ప్రధాని తనను కలవడానికి వచ్చే ప్రతిభావంతుల కాళ్లకు నమస్కారం చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మోడీకి ఇటువంటి నేపథ్యం ఉన్న పరిస్థితులలో దేశ ప్రజలు, సైన్యం ప్రధాని కాళ్లు మొక్కాలని ఉపముఖ్యమంత్రి చెప్పడంలో ఔచిత్యం ఏమిటో తెలియడం లేదు. సైనికులు తమ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి తెలియజేసినందుకు కాళ్లు మొక్కాల్సి ఉండేనా? సైన్యం ధైర్యసాహసాలతో ఉగ్రవాద స్థావరాలు నేలమట్టం చేసి పాకిస్తాన్‌ను కాళ్ళబేరానికి తీసుకొచ్చినందుకు సాగిలపడాలా? ప్రధానమంత్రి తీసుకునే నిర్ణయానికి ప్రజలు, ప్రతిపక్షాలు మద్దతు ఇచ్చి ఐక్యంగా నిలబడినందుకా? మొదలగు ప్రశ్నలకు కమలనాథుల నుంచి సమాధానం ఆశించడం వృథా ప్రయాసే అవుతుంది. దేశవ్యాప్తంగ ఓ వైపు పాకిస్తాన్ కుతంత్రాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు దౌత్యప్రచారానికి కమిటీలను నియమిస్తున్న కేంద్ర ప్రభుత్వం, మరోవైపు దేశంలోపల సైన్యంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్న తమ నాయకులను అదుపులో పెట్టలేకపోవడం విస్మయం కలిగిస్తోంది. దేశంలో పహల్గాం ఉగ్రదాడి, అనంతరం జరిగిన ఆపరేషన్ సింధూర్ పరిస్థితులపై బిజెపి నాయకులు మాట్లాడే మాటలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తాజాగా హర్యానా బిజెపి రాజ్యసభ సభ్యుడు రామచందర్ జంగ్రా ఉగ్రదాడిలో భర్తల ప్రాణాలు కోల్పోయిన మహిళలపై నోరు పారేసుకున్నాడు. భర్తలను కోల్పోయిన మహిళలకు స్ఫూర్తి, వీరోచిత లక్షణాలు లేవని ఉగ్రవాదులను వేడుకునే బదులు తిరగబడాల్సిందని నాలుకకు పని చెప్పాడు. విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతున్న ఉగ్రమూకలపై నిస్సహాయులైన మహిళలు ఏ రకంగా పోరాటం చేస్తారో అతని మేధస్సుకే తెలియాలి. గతంలో జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేను దేశభక్తుడిగా పార్లమెంటు సాక్షిగా బిజెపి ఎంపి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ కీర్తించింది. రూ. 100 కోసం రైతు చట్టాల వ్యతిరేక నిరసన దీక్షలో మహిళా రైతులు కూర్చున్నారని ఎంపి కంగనా రనౌత్ ఎగతాళి చేసింది. జాతిపితపై, రైతులపై చేసిన విషపూరిత వ్యాఖ్యలకు గాను ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, కంగనా రనౌత్ పై బిజెపి ఆనాడే కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుని ఉంటే నేడు ప్రజలు, సైనికులు, వితంతువులపై అవమానకర, విద్వేష మాటలు వచ్చి ఉండేవి కావు. కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రధాన వార్తా స్రవంతిలో ఉండటానికి ఆలోచన రహితంగా ఏదిపడితే అది మాట్లాడటం, తరువాత క్షమాపణలు చెప్పటం, వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని బుకాయించటం అలవాటైపోయింది. ఢిల్లీలో జరిగిన ఎన్‌డిఏ పాలిత రాష్ట్రాల సిఎంలు, డిప్యూటీ సిఎంల మీటింగ్‌లో కీలకమైన అంశాలపై మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని, నోరు జారొద్దని సుతి మెత్తగా మోడీ చేసిన హెచ్చరిక ఏమాత్రం పని చేస్తుందో వేచి చూడాలి. దేశఐక్యత, సంస్కృతి సంప్రదాయాలు, గౌరవ మర్యాదలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పే బిజెపి తమ నాయకులు ఇష్టాను రీతిగా మాట్లాడే మాటలను అదుపు చేయనట్లయితే ప్రజల విశ్వాసాన్ని కోల్పోక తప్పదు.






# తెలుగు సాహిత్యానికి తత్వశిఖరం

తెలుగు సాహిత్యాన్ని తన అద్భుత కవిత్వంతో, లోతైన విమర్శలతో, విశ్లేషణాత్మక వ్యాసాలతో కొత్త దిశల్లో నడిపించిన మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ. ఆయన కేవలం ఒక కవి మాత్రమే కాకుండా, సమాజంలో చైతన్యాన్ని రేపే ఒక విప్లవాత్మక శక్తి. ఆధునిక తెలుగు కవిత్వానికి ఊతమిచ్చిన మహోన్నత వ్యక్తిత్వం. శేషేంద్ర సాహిత్య ప్రపంచం వర్ణనాత్మకత, తత్త్వచింతన, సామాజిక చింతన, భాషా వైవిధ్యం, అంతర్జాతీయ దృక్పథంలతో విస్తరించి ఉంది. శేషేంద్ర శర్మ జననం 1927 అక్టోబర్ 20న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాగరాజుపాడు గ్రామంలో జరిగింది. ఆయన తండ్రి సంస్కృత సాహిత్యంలో ప్రావీణ్యం కలిగిన పూజారి గుంటూరు సుబ్రహ్మణ్య శర్మ. చిన్ననాటి నుంచే శేషేంద్రకు వేదాలు, ఉపనిషత్తులు, సంస్కృతం మీద మక్కువ పెరిగింది. విద్యాభ్యాసం తొటపల్లి గూడూరు పాఠశాలలో ప్రారంభమై ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడిగా, మద్రాసు లా కాలేజీ నుండి న్యాయ శాస్త్రంలో డిగ్రీతో కొనసాగింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో మునిసిపల్ కమిషనర్‌గా ఉద్యోగం చేసినప్పటికీ, సాహిత్యపట్ల ఆయన ఆసక్తి ఎప్పటికీ తగ్గలేదు. శేషేంద్ర శర్మ సాహితీ ప్రస్థానం అసాధారణం. ఆయన కవిత్వంలో ఉన్న అద్భుత ఊహాశక్తి, సామాజిక చింతన, తత్త్వ విచారణ, వ్యక్తిత్వ విశ్లేషణ తెలుగు కవిత్వాన్ని కొత్త శిఖరాలకు చేర్చింది. కేవలం రూపకాలు, అలంకారాలతోనే కాదు, కవిత్వంలో లోతైన భావాలను మేళవించి సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా రచనలు చేశారు. తన కవిత్వంలో తర్కం, ఆచార విచారం, చరిత్ర బోధ, తత్త్వచింతన మేళవించి ఒక ప్రత్యేక శైలిని రూపొందించారు. ''నా దేశం నా ప్రజలు'' అనే కావ్యం శేషేంద్రగారిని దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చింది. ఇందులో సామాజిక అసమానతలు, దేశభక్తి, మానవీయత వంటి అంశాలను రసప్రధంగా, ఆవేశ పూరితంగా వ్యక్తీకరించారు. ''మంథర'', ''షోడశి రామాయణ రహస్యాలు'', ''ఆధునిక మహాభారతం'', ''స్వర్ణ హంస'', ''సముద్రపు రెక్కలు'', ''నెమలికన్ను'' వంటి రచనలు శేషేంద్రను ఆధునిక తెలుగు సాహిత్యంలో దృఢంగా నిలిపాయి. ''మంథర''లో భారతీయ తత్త్వశాస్త్రం పట్ల ఆయన అవగాహన, అంతరంగా పొందిన అనుభూతులు ప్రతిఫలిస్తాయి. ''షోడశి''లో రామాయణంలోని రహస్యాలను లోతుగా పరిశీలిస్తూ శ్రీవరాలను సరికొత్త దృక్పథంలో ఆవిష్కరించారు. శేషేంద్ర వచన కవిత్వం కేవలం వర్ణనాత్మకతకు పరిమితం కాకుండా, జాతీయ మరియు అంతర్జాతీయ సాహిత్య ధోరణులను అద్భుతంగా మిళితం చేసింది. అందులో భాషా వైవిధ్యం, సంస్కృత పదసముపేతం, ప్రతీకలు, చిహ్నాల విశేష ప్రయోగం, శబ్ద సౌందర్యం సమ్మేళనం సాహితీ పాఠకులను విశేషంగా ఆకర్షిస్తుంది. కవిత్వం అంటే కేవలం భావాలను వ్యక్తీకరించడం మాత్రమే కాదు, అది ఒక చైతన్య ప్రవాహం అని ఆయన నిరూపించారు. శేషేంద్ర కవిత్వం మనసుకు హత్తుకునే రూపంలో, ఒక వేళ వినిపిస్తే సంగీతంలా, చదివితే తత్త్వ రససుధగా అనిపిస్తుంది. ''సముద్రం నా పేరు'', ''గొరిల్లా'', ''మండే సూర్యుడు'', ''కవిసేన మేనిఫెస్టో'', ''రక్త రేఖ'', ''కాలరేఖ'', ''జనవంశమ్'' వంటి రచనలు కాలంతో పోరాడే కవిత్వానికి, సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యానికి ప్రతీకలు. శేషేంద్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1994లో ''నా దేశం నా ప్రజలు''కు), తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, కలకత్తా రాష్ట్రీయ హిందీ అకాడమీ అవార్డు, విశ్వకవి పురస్కారం లాంటి అనేక ప్రతిష్ఠాత్మక బహుమతులు లభించాయి. కవిసేనాని, కవి చక్రవర్తి, రాష్ట్రేంద్రులాంటి బిరుదులు ఆయన సాహిత్య ప్రస్థానానికి గౌరవ తీర్థాలు. శేషేంద్ర శర్మ కేవలం కవి కాదు తత్త్వవేత్త, చింతకుడు, సమాజానికి మార్గదర్శకుడు. ఆయన రచనలు తెలుగులోనే కాదు, అనేక భాషల్లోకి అనువదించబడి విశ్వసాహిత్యంలోనూ తనదైన స్థానం సంపాదించుకున్నాయి. 2007 మే 30న ఆయన భౌతికంగా మన మధ్యనుండి వెళ్లిపోయినా, ఆయన సాహిత్యమూర్తి తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది. తెలుగు సాహిత్య చరిత్రలో శేషేంద్ర శర్మ ఒక మహానామం. ఆయన కవిత్వం, విమర్శ, తత్త్వచింతనలు ఈ తరానికి మాత్రమేకాదు, రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవనున్నాయి.

## భారతీయ జర్నలిజం ఆద్యుడు

రెండు దశాబ్దాలకు పూర్వం ఆంగ్లం, పార్సియన్ లాంటి భాషల్లో మాత్రమే పాఠకులకు పత్రికలు అందుబాటులో ఉండేవి. హిందీ భాష అత్యధికంగా మాట్లాడే భారతంలో నాడు హిందీలో పత్రికలు ఉండేవి కాదు. ఈ లోటును గ్రహించిన కాన్పూర్‌కకు చెందిన పండిట్ జుగల్ కిషోర్ శుక్లా 30 మే 1826 రోజున కొల్‌కతాలో తొలిసారిగా ''ఉదంత్ మార్తాండ్ (ఉద్యమించే సూర్యుడు)'' అనే వార పత్రికను అందుబాటులోకి తేవడంతో భారతీయ భాషల్లో పత్రికల విప్లవం ప్రారంభమైంది. ఈ మహత్తర సంఘటనకు గుర్తుగా ప్రతి ఏట 30 మే రోజున ''హిందీ జర్నలిజం దినోత్సవం (హిందీ జర్నలిజమ్ డే)''ను పాటించుట ఆనవాయితీగా మారింది. ఈ వేదిక ఆధారంగా హిందీ జర్నలిస్టులు, ఎడిటర్లు, ఫోటోగ్రాఫర్లు, కరస్పాండెంట్లు లాంటి వర్గాల త్యాగాలు, అంకితభావాలను గుర్తు చేసుకోవడంతో పాటు విధి నిర్వహణలో ప్రాణాలు సహితం కోల్పోయిన వారికి నివాళులు అర్పించడం జరుగుతుంది. నాడు హిందీ పాఠకులు తక్కువగా ఉండడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కేవలం 79 వారాలు మాత్రమే పత్రికలను విడుదల చేసి ఆ తర్వాత ఆపి వేయడం జరిగింది. అయినప్పటికీ నాడు జుగల్ కిషోర్ శుక్లా నాటిన చిన్న హిందీ పత్రిక బీజం కాలక్రమంలో విస్తరించి నేడు పాఠకులకు అనేక రకాలైన పత్రికలు, ఆన్‌లైన్ పత్రికలు, టీవీ చానెల్స్ లాంటివి అందుబాటులోకి రావడం జరిగింది. పత్రిక అంటే సమాచార వితరణ మాత్రమే కాదని, ఇవి ప్రజలను ఏకం చేసే శక్తివంతమైన మాధ్యమాలని, సమస్యలను పరిష్కరించే వేదికలని తెలుసుకోవాలి. నేటి పత్రికలు మానవ హక్కులు, సజావుగా ఎన్నికల నిర్వహణ, విద్య, సమకాలీన అంశాలు, రాజకీయం, సామాజిక సమస్యలను బహిరంగ పరిచే వేదికలుగా అమూల్య సేవలను అందిస్తున్నాయి. 1826లో ప్రారంభమైన తొలి హిందీ పత్రిక తర్వాత దినదినం అభివృద్ధి చెందుతూ నేడు వందల, వేల పత్రికలు అందుబాటులోకి వచ్చాయి దైనిక్ జగరన్, అమర్ ఉజాల, హిందూస్థాన్, రాజస్థాన్ పత్రిక లాంటివి అనేకం పాఠకులకు సమాచార, విద్య, విజ్ఞాన, సామాజిక చైతన్య విందులను వడ్డిస్తున్నాయి. 1990ల్లో హిందీ టీవీ చానెల్స్ అందుబాటులోకి రావడం, తర్వాత యూట్యూబ్ చానెల్స్, మొబైల్ ఆప్‌లు లాంటి రావడంతో నేడు అరచేతిలో అన్ని పత్రికలు ఇమిడిపోయాయి. హిందీ జర్నలిజం దినం వేదికగా యూనివర్సిటీలు, పత్రికా సంస్థలు, ప్రెస్ క్లబ్‌లు, పాఠక సంఘాలు పలు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. డిజిటల్ ఏఐ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న వేళ నేడు పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతూ పలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. నీతి నిజాయితీ, జవాబుదారీతనం, ప్రజా సేవ అనే పునాదుల మీద జర్నలిజం నిలబడాలి. పత్రికలు పక్షపాతంతో దారి తప్పితే ప్రజలకు భారీ నష్టం జరుగుతుంది. చీకటిలో బతుకుతున్న అభాగ్యుల జీవితాల్లో పత్రికలు వెలుగులు నింపాలి. ప్రతి వార్తను క్షణాల్లో అందిస్తున్న డిజిటల్ విప్లవంతో పత్రికల మనుగడ మసకబారరాదు. పత్రికల ప్రాధాన్యాన్ని ప్రత్యామ్నాయం లేదని గమనించాలి. పత్రికలు పోషించడానికి ప్రజలు పాఠకులుగా మారి ముందుకు రావాలి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మద్ది ఉపేందర్ రెడ్డి మృతికి మంత్రి పొంగులేటి సంతాపం

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్ది ఉపేందర్ రెడ్డి గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతి పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తీవ్రంగా కృషిచేశారని కొనియాడారు. పాలేరు నియోజకవర్గంలో తన గెలుపునకు శ్రమించారని అలాంటి నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని పేర్కొన్నారు. ఆయన అకాల మృతి తనకు తీవ్ర మనోవేదనను కలిగించిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ని ప్రార్థించారు.



# పరకాల మహిళా డెయిరీ, శిక్షణ కేంద్రాలపై సమీక్ష

- ఎమ్మెల్యే రేవూరి నేతృత్వంలో అధికారులతో సమావేశం

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:

మహాజనసభ అనంతరం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారదలతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పరకాల మహిళా డెయిరీ ఏర్పాటు, నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం, ప్రకృతి వ్యవసాయంపై చర్చ జరిగింది. మహిళా డెయిరీ కోసం అవసరమైన మౌలిక వసతులు, పాల సేకరణ వ్యవస్థ, నిర్వహణ విధానాలపై నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్, జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా, విహబ్, వ్యవసాయ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు ఇచ్చారు. ఆరు మండలాల్లో పశువుల సంఖ్య, పాల ఉత్పత్తి సామర్థ్యం, పశు ఆహారం వంటి అంశాలపై సమీక్ష సాగింది.

దామెర మండలం ల్యాదెల్లలో మహిళా నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని జూన్ నెలలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు వేగంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. శిక్షణ కేంద్రానికి అవసరమైన వనరులను సమకూర్చే బాధ్యతను సంబంధిత అధికారులకు అప్పగించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయిలో పది మండలాల్లోని పది గ్రామాలు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన గ్రామాలకే పరిమితం కాకుండా ఇతర గ్రామాల్లోనూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఈ విధానాన్ని విస్తరించేందుకు సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి నగదు ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో గ్రామంలో కనీసం 125 ఎకరాల్లో ఈ విధానాన్ని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో గ్రామీణాభివృద్ధి అధికారులు మేన శ్రీను, కౌసల్యాదేవి, వ్యవసాయ శాఖ అధికారులు రవీందర్ సింగ్, అనురాధతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేదల పాలిట వరం సిఎంఆర్ఎఫ్

- పేదల ఆరోగ్యానికి సహాయంగా సీఎం సహాయనిధి
- 93 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:



ఆరోగ్య పరంగా సామాన్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయనిధి విశేషంగా ఉపయోగపడుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హనుమకొండలోని బాలసముద్ర ప్రాంతంలోని ప్రజా భవన్‌లో 93 మంది లబ్ధిదారులకు రూ. 37.43 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారు మెరుగైన వైద్యం పొందే అవకాశాన్ని సృష్టించామని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. స్థానికంగా ప్రతి నెలనూ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనారోగ్యంతో బాధపడే వారు ఇచ్చే దరఖాస్తులను పరిశీలించి, అర్హత ఉన్నవారికి సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా సహాయం అందిస్తున్నామని స్పష్టం చేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో అందరికీ సమానంగా అవకాశాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు,ఎరువుల అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలి

- దేశ వ్యాప్తంగా ధాన్యం సేకరణలో మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్రం
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి
- వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:








ఉమ్మడి వరంగల్ జిల్లాలో ధాన్యం సేకరణ, వ్యవసాయం, వర్షాకాలం ముందస్తు ప్రణాళిక, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలు, ఎరువుల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్ట్‌తో చర్యలు తీసుకోవాలని, ఎవరైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం సేకరణలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. అంచనాలకు మించి 160 శాతం అధికంగా ధాన్యం వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 85 శాతం ధాన్యం కొనుగోలు పూర్తయిందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా సురక్షితంగా కొనుగోలు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వేగవంతం చేయాలని, జూన్ 6 నాటికి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయాలన్నారు. ఇసుక ఉచితంగా అందిస్తామని, రవాణా ఖర్చులు లబ్ధిదారులు భరించాల్సిన అవసరం ఉందన్నారు. బఫర్ జాబితా రూపొందించాలని, అత్యంత నిరుపేదలకే మొదటి దశలో ఇళ్లు ఇవ్వాలని సూచించారు. గ్రామ పాలన అధికారుల నియామకం జూన్ 2న నిర్వహిస్తామని తెలిపారు. సాదా బైనామా అంశంపై కోర్టు సెలవుల అనంతరం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జూన్ 3 నుండి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు, నియోజకవర్గాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నకిలీ విత్తనాల నియంత్రణ కమిటీలో రైతులు భాగస్వాములు కావాలని, టాస్క్‌ఫోర్స్ నిఘాను మరింత బలపరచాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు - మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి -తమ నియోజకవర్గాల సమస్యలు, అవసరాలపై వివరాలు అందించారు. హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు జిల్లాల ప్రగతి నివేదికలు సమర్పించారు. వారిలో డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, రిజ్వాన్ భాషా, టీఎస్ దివాకర్, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మలు ఉన్నారు.ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





# మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకే డెయిరీ ఏర్పాటు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:

పరకాల నియోజకవర్గ మహిళల ఆర్థిక సాధికారతను లక్ష్యంగా తీసుకుని ఏర్పాటు చేయనున్న మహిళా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాల డెయిరీపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో మహాజనసభ నిర్వహించబడింది. ఈ సభలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ సత్య శారద, పలు శాఖల అధికారులు, మండలాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

సభలో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు సంబంధించి రెండు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో ముందుకు వస్తున్నారని చెప్పారు. ములుకనూర్ మహిళా డెయిరీను ఆదర్శంగా తీసుకుని పరకాల డెయిరీను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వ్యవస్థ ద్వారా మహిళలు ఆర్థికంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. ఎన్డీడీ సహకారంతో డెయిరీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, డెయిరీ నిర్వహణలో ప్రారంభంలో కష్టాలు ఉన్నా పట్టుదల, కృషితో విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సరైన నాయకత్వాన్ని ఎంపిక చేసి, ప్రభుత్వం అందించే రుణాలు, ఇతర అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. వరంగల్ కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, మహిళల అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డెయిరీ నిర్వహణను సవాలుగా తీసుకుని క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు. సభలో పాల్గొన్న పరకాల మండలాల మహిళలు ములుకనూర్ డెయిరీ సందర్శన అనుభవాన్ని పంచుకుంటూ, తమ ప్రాంతంలో కూడా అలాంటి విజయాన్ని సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అధికారుల సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి అధికారులు మేన శ్రీను, కౌసల్యదేవి, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ అధికారులు లత, సుందర్ రావు, పలు శాఖల ప్రతినిధులు, పరకాల మహిళా డెయిరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతను మెరుగుపరచడంతో ప్రజల ప్రాణాలను కాపాడవచ్చు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.
- రోడ్డు భద్రతా నియమాలను కఠినంగా అమలు.
- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి.

మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు.



సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం రహదారి భద్రతపై జిల్లా స్థాయి నెలవారి సమీక్ష. ఈ సమావేశంలో జిల్లాలోని పలు శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. ముందుగా రహదారి భద్రత ప్రమాదాలు జరుగు బ్లాక్ స్పాట్స్ నేషనల్ హైవే ద్వారా చేపట్టే ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రమాదాలు నివారణ ప్రజలను రక్షించడంలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు.రహదారి ప్రమాదాలను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పక్కా ప్రణాళికతో క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు కఠినంగా అమలు చేస్తున్నామని, తనిఖీలు నిర్వహిస్తూ వాహన చోదకులు నిబంధనలు పాటించాలని ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో సంబధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పేద విద్యార్థుల పట్ల గురుకుల సెక్రెటరీ వైఖరీ దుర్మార్గం

- పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్
- గురుకుల సెక్రెటరీ దిష్టిబొమ్మ దగ్ధంచేసిన పిడిఎస్యు

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:




పేద, దళిత విద్యార్థులపై వివక్ష చూపుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సాంఘీక సంక్షేమ గురుకుల సెక్రెటరీ అలుగు వర్షిణీ ని వెంటనే గురుకుల సెక్రెటరీ పదవినుండి తొలగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల రాష్ట్ర సెక్రటరీ అలుగు వర్షిణి గురుకుల విద్యార్థులుపై అనుచిత వాక్యాలను నిరసిస్తూ పిడిఎస్యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అలుగు వర్షిణి దిష్టి బొమ్మను గురువారం మున్సిపాలిటీ సెంటర్ నందు దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ లు మాట్లాడుతూ పేదవిద్యార్థులను బాత్రూంలు క్లీన్ చేసుకోవాలని, వంట చేసుకోవాలని, ఊడ్చుకొని తూడ్చుకోవాలని ఒక ఐఏఎస్ అధికారి గురుకుల సెక్రటరీ అలుగు వర్షిణి వ్యాఖ్యలను పిడిఎస్యు కమిటీ త్రివరంగా ఖండించింది. ఎవరైనా పిల్లల పక్షాన తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారి పిల్లలకు షోకాజ్ నోటీస్లు ఇస్తారా.,? 40 సంవత్సరాల సోషల్ వెల్ఫేర్ గురుకుల చరిత్రలో ఇంతటి మానవత్వం లేని సెక్రటరీని ఎక్కడ కూడా చూడలేదని దుయ్యబట్టారు. దళిత విద్యార్థులకు గతంలో కంటే మెరుగైన విద్యను అందించాలని ఐఏఎస్ అధికారిగా గురుకుల సెక్రటరీని నియమిస్తే ఇంత వివక్షత చూపుతారా అని ప్రశ్నించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కస్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, దళిత విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకునే స్తోమత లేకనే మయనీయులైన మేధావులు అలోచనచేసి గురుకులాలను ఏర్పాటుచేశారని కొనియాడారు. గురుకులాల్లో ప్రైవేట్, కార్పొరేట్ కు ధీటుగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. గురుకులాల్లో సెక్రెటరీ గా పనిచేసిన ఎవ్వరూ కూడా విద్యార్థులను విద్యకు దూరంచేసే ఇలాంటి దారుణ సంఘటనలకు పాల్పడలేదన్నారు. గురుకుల సెక్రెటరీగా అలుగు వర్షిణీ బాధ్యతలు చేపట్టిన దగ్గర నుండి గురుకులాలను భ్రస్టుపట్టించే విధంగా వివాస్పద నిర్ణయాలు తీసుకోవడం, వ్యాఖ్యలు చేయడం ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నాయన్నారు. అందులో విద్యార్థులు లేరనే సాకుతో రాష్ట్ర వ్యాప్తంగా 12 గురుకుల ఇంటర్ కళాశాలలను తొలగించి సుమారు వెయ్యిమంది విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. గురుకులాల్లో ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న ల్యాబ్ అటెండర్స్ కు ఏప్రిల్, మే నెలల జీతాలు ఇవ్వలేదు, ఎలక్ట్రిషన్లకు జీతాలు ఇవ్వకుండానే నిర్ధాక్ష్యణ్యంగా తొలగించారు. తెలంగాణ వ్యాప్తంగా పనిచేస్తున్న ఏసిటీలకు ఏప్రిల్ జీతాలు ఇవ్వకుండా తొలగించారు. పాఠశాలలో పనిచేస్తున్న స్వీపింగ్, శానిటేషన్ వర్కర్స్ను బిల్లులు ఇవ్వకుండానే తొలగించారు. తాత్కాలిక, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఏప్రిల్ నెల జీతాలు ఇవ్వలేదు. గత నాలుగు నెలలుగా కాంట్రాక్టర్లకు (స్వీపింగ్, చికెన్, మటన్, కూరగాయలు, పండ్లు, క్యాటరింగ్, కిరాణం) బిల్లులు ఇవ్వలేదు. గురుకుల విద్యార్థినులకు గత 3 నెలలుగా కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అదేవిధంగా మహిళల పాఠశాలలు, ఎక్కడా లేని విధంగా కళాశాలలో పురుష సిబ్బంది ఉండొద్దని ఆదర్స్ జారీచేయడం కూడా వివాదస్పద నిర్ణయాలే అని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా బిక్కనూరు పాఠశాలలో ఎలక్ట్రీషన్ ను తొలగించడం వలన కరెంట్ పని తెలియని అటెంటర్ విద్యుత్యాఖ్ కు గురై మరణించడం జరిగిందన్నారు. దీనికి గురుకుల సెక్రెటరీ బాధ్యత వహించాలన్నారు. గురుకుల సెక్రెటరీ తీసుకున్న వివాదస్పద నిర్ణయాలే వీటన్నిటికి కారణమని గురుకుల పేరెంట్స్ కమిటీలు, గురుకుల యూనియన్లు కూడా ఆరోపిస్తున్నాయని వివరించారు. వెంటనే గురుకుల సెక్రెటరీని తొలగించి గతంలో మాదిరిగానే గురుకుల విద్యాలయాలను కొనసాగించాలని, తొలగించిన నిరుద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా నాయకులు యశ్వంత్, సందీప్, ప్రాణవ్, ప్రసాద్, పేరాల వెంకటేష్, జీవన్, మాజీ రాష్ట్ర నాయకులు మురళి, జిల్లా నాయకులు తిమ్మిడి రఘు, నసీర్, అనిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 30 - మే - 2025





# 'వీరమల్లు' కథేంటి అంటే..

తెలుగులో చాన్నాళ్ల తర్వాత రాబోతున్న పెద్ద సినిమా.. హరిహర వీరమల్లు. ఆరేళ్ల కిందట మొదలై.. షూటింగ్ చాలా ఆలస్యం అయిన ఈ చిత్రం.. విడుదల తేదీని కూడా పలుమార్లు మార్చుకుంది. ఎట్టకేలకు జూన్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈసారి సినిమా రిలీజ్ విషయంలో ఎలాంటి సందేహాలు పెట్టుకోవాల్సిన పని లేదు. విడుదలకు చకచకా ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. ప్రమోషన్లు కూడా నడుస్తున్నాయి. ఇటీవలే చిత్ర బృందం ఒక గ్రాండ్ ప్రెస్ మీట్ పె ట్టింది.మరోవైపు హీరోయిన్ నిధి అగర్వాల్.. మీడియా ఇంటర్వ్యూలు మొదలుపెట్టింది. ఆమె పాన్ ఇండియా స్థాయిలో సినిమాను ప్రమోట్ చేయడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా ఒక హిందీ ఇంటర్వ్యూలో 'హరిహర వీరమల్లు' కథ గురించి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేసింది నిధి. 'హరిహర వీరమల్లు' ఔరంగజేబు కాలం అయిన 17వ శతాబ్దంలో నడిచే కథ అట. పవన్ కళ్యాణ్ రాబిన్ హుడ్ తరహా పాత్రలో కనిపించనున్నట్లు ఆమె వెల్లడిరచింది. పవన్ పాత్రను కొంచెం ఆయన నిజ జీవిత క్యారెక్టర్‌ను దృష్టిలో ఉంచుకుని, అలాగే కొంచెం కల్పన జోడిరచి తీర్చిదిద్దారట. దొరల నుంచి దోచుకుని పేదలకు పంచి పెట్టే పాత్రలో పవన్ కనిపిస్తాడని.. ఈ కథ కొంతమేర కోహినూర్ వజ్రం చుట్టూ కూడా తిరుగుతుందని నిధి వెల్లడిరచింది. పవన్ పాత్రే సినిమాకు మేజర్ హైలైట్ అని ఆమె చెప్పింది. తన పాత్రకు కూడా కథలో ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, తన కెరీర్లో ఇది చాలా స్పెషల్ సినిమా అని నిధి తెలిపింది. క్రిష్ స్క్రిప్టుతో ఆయన దర్శకత్వంలో మొదలైన 'హరిహర వీరమల్లు'.. షూటింగ్ చాలా ఆలస్యం కావడం వల్ల.. చివరి దశలో నిర్మాత ఏఎం రత్నం తనయుడు జ్యోతికృష్ణ చేతుల్లోకి వచ్చింది. దయాకర్ రెడ్డి అనే నిర్మాతతో కలిసి రత్నం ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశాడు. దీని బడ్జెట్ రూ.200 కోట్లకు పైమాటే అని సమాచారం.



# ఇళయరాజా మాటల్లో అపార్థముందా..?

లెజెండరీ సెలబ్రిటీలు ఏదైనా పొరపాటుగా మాట్లాడినా ఉద్దేశపూర్వకంగా మాట్లాడినా అందులోని అర్థం సరిగా కన్వే కాకపోతే అపార్థంగా మారిపోతుంది. ఇది ఎన్నోసార్లు చూశాం. తాజాగా ఇసైజ్ఞాని ఇళయరాజా ఉదంతం చూస్తే అదే అనిపిస్తుంది. రేపు విడుదల కాబోతున్న షష్ఠిపూర్తికి ఆయన సంగీతం అందించారు. సాధారణంగా ప్రమోషన్ల దూరంగా ఉండే మాస్ట్రో దీనికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నా అంత గొప్ప వారు ఎవరూ లేరనే స్థాయిలో ఆయనన్న మాటలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. కావాలంటే ఎవరితో అయినా పోల్చి చూడండని చెప్పడం గురించి డిస్కషన్లు జరుగుతున్నాయి.అసలు ఇంతకీ ఇళయరాజా ఉద్దేశమేంటో అర్థం చేసుకుంటే స్పష్టంగా అర్థమవుతుంది. ఒక కుగ్రామం నుంచి వచ్చి ఎవరి దగ్గర శిక్షణ తీసుకోకుండా, ఏ సంగీత దర్శకుడి దగ్గర అసిస్టెంట్ గా పని చేయకుండా, ఇంత స్థాయికి రావడం తన విషయంలో జరిగిందని, ఎంఎస్ విశ్వనాథన్ లాంటి వాళ్ళు సైతం మహామహుల దగ్గర పని చేశాకే తమదైన ముద్ర వేశారని, కానీ నేను మాత్రం అలా కాదని ఇళయరాజా చెప్పుకొచ్చారు. నిజానికి ఆయన అన్నది ఎవరి చేయూత లేకుండా నేను పైకి వచ్చానని. అలా నా ముందు నా తర్వాత ఎవరూ లేరనేది సారాంశం. కానీ తెలుగులో దాన్ని వ్యక్తపరిచే తీరులో బాష ఇబ్బంది వల్ల మీనింగ్ మారిపోయింది. ఇదేదో ఇళయరాజాని సమర్ధించే ప్రయత్నం కాదు. ఎవరైనా సరే సపోర్ట్ లేకుండా కూడా కష్టపడి పైకి రావొచ్చనేది ఇళయరాజా చెప్పాలనుకున్న అసలు మాట. గతంలో నేనింకా బెస్ట్ ఇవ్వలేదు, నేర్చుకోవాల్సింది చాలా ఉందంటూ వినయంగా చెప్పుకోవడం ఇలాంటి వేదికల్లోనే చూశాం. ఇప్పుడేదో అహంకారపూరితంగా మాట్లాడతారనుకోవడం సరికాదనేది అభిమానుల అభిప్రాయం. ఒకప్పుడు అద్భుతమైన ఆల్బమ్స్ తో మర్చిపోలేని పాటలు ఇచ్చిన ఇళయరాజా ఇప్పుడా స్థాయిలో కంపోజ్ చేయకపోయినా మంచి సాంగ్స్ అయితే ఇస్తున్నారు. మరి తాజాగా జరిగింది అర్థమో అపార్థమో ప్రేక్షకులే గుర్తించాలి.

# తప్పు ఒప్పుకున్నా.. క్షమాపణ చెప్పని కమల్

లోకనాయకుడు కమల్ హాసన్ తాజాగా ఒక ఊహించని వివాదంలో చిక్కుకున్నారు. తన కొత్త చిత్రం 'థగ్ లైఫ్'కు సంబంధించి చెన్నైలో జరిగిన ఆడియో రిలీజ్ ఫంక్షన్‌కు అతిథిగా వచ్చిన శివరాజ్ కుమార్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. కన్నడ భాష తమిళ నుంచే పుట్టిందని ఆయన వ్యాఖ్యానించడం కన్నడ నాట దుమారం రేపింది. ఏకంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ అంశం మీద స్పందించారు. కన్నడ భాషకు సుదీర్ఘ చరిత్ర ఉందని.. దాని మూలాల గురించి కమల్ తెలియకుండా మాట్లాడాడారని విమర్శించారు.మరోవైపు కన్నడ సంఘాలు, రాజకీయ పార్టీల వాళ్లు కూడా కమల్ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. వ్యవహారం పెద్దది అవుతుండడంతో కమల్ స్పందించారు. తాను మాట్లాడిరది తప్పే అన్న ఉద్దేశంతో మాట్లాడిన కమల్.. ఆ తప్పుకు క్షమాపణ మాత్రం చెప్పలేదు. తాను కన్నడిగుల గురించి ప్రేమతో మాట్లాడానన్న కమల్.. ప్రేమ క్షమాపణ చెప్పదు అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''నేను ప్రేమతోనే అలా మాట్లాడాను. ప్రేమ ఎప్పుడూ క్షమాపణ చెప్పదు. ఎంతోమంది చరిత్రకారులు భాష చరిత్ర గురించి నాకు నేర్పించారు. నేను చేసిన వ్యాఖ్యల్లో మరో ఉద్దేశం లేదు. తమిళనాడు అరుదైన రాష్ట్రం. ప్రతి ఒక్కరినీ మిళితం చేసుకునే తత్వం ఈ రాష్ట్రానికి ఉంది. ఒక మేనన్ (ఎంజీఆర్) ముఖ్యమంత్రి అయ్యారు. ఒక రెడ్డి (ఒమందూరి రామస్వామి రెడ్డియార్) సీఎంగా పని చేశారు. మైసూర్ సంస్థానంలో పని చేసిన నరసింహన్ రంగచారి మనవరాలు (జయలలిత) కూడా ముఖ్యమంత్రి అయ్యారు. చెన్నైలో నేను ఇబ్బందులు ఎదుర్కొంటే కర్ణాటక నాకు మద్దతుగా నిలిచింది. మీరు ఎక్కడికీ వెళ్లొద్దు, ఆశ్రయం కల్పిస్తాం అన్నారు. రాజకీయ నాయకులకు భాష గురించి మాట్లాడే అర్హత లేదు. నాతో సహా ఎవ్వరికీ దీని మీద మాట్లాడే అర్హత లేదు. దీనిపై లోతైన చర్చను చరిత్రకారులకు, పురావస్తు శాస్త్రవేత్తలు, భాషా నిపుణులకు వదిలేద్దాం'' అని కమల్ వ్యాఖ్యానించారు.





# ప్రభాస్‌ను పారితోషకంపై అడిగితే..

మంచు ఫ్యామిలీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన 'కన్నప్ప' సినిమాకు అతి పెద్ద ఆకర్షణ ప్రభాస్ అనడంలో సందేహం లేదు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాకు బజ్ క్రియేట్ అయిందంటే ప్రభాస్ ప్రత్యేక పాత్ర చేయడం కారణం. బిజినెస్ పరంగానూ ఈ సినిమాకు ప్రభాస్ అతి పెద్ద బలమయ్యాడు. ప్రభాస్ ఈ సినిమా చేసిన సాయం సామాన్యమైనది కాదని.. అతడికి ఎప్పుడూ రుణపడి ఉంటానని హీరో కమ్ ప్రొడ్యూసర్ మంచు విష్ణు ప్రతి ఇంటర్వ్యూలో చెబుతూనే ఉన్నాడు.ఈ సినిమాలో ప్రభాస్ పాత్రకు చెప్పుకోదగ్గ నిడివే ఉందని.. అతను అరగంట పాటు కనిపిస్తాడని ఇటీవలే విష్ణు వెల్లడిరచడంతో అభిమానులు చాలా ఆనంద పడ్డారు. దేశవ్యాప్తంగా ప్రభాస్ ఫ్యాన్స్ ఈ సినిమా చూడ్డానికి అంతకుమించిన కారణం అవసరం లేదు. మరి అంత నిడివి ఉన్న పాత్రను చేయడానికి ప్రభాస్ ఎంత పారితోషకం తీసుకుని ఉంటాడనే ఆసక్తి అందరిలోనూ ఉంది. కానీ ప్రభాస్ ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఈ సినిమాలో నటించడం విశేషం. ఐతే ప్రభాస్‌కు మంచు ఫ్యామిలీ రెమ్యూనరేషన్ ఇవ్వొద్దనేమీ అనుకోలేదట. విష్ణు అందుకోసం గట్టిగానే ప్రయత్నించాడట. ఐతే విష్ణు ఎప్పుడు ఆ విషయం ఎత్తినా ప్రభాస్ దాటవేస్తూ ఉండేవాడట. దీంతో ఇక లాభం లేదని.. మోహన్ బాబు దగ్గరికి వెళ్లి ప్రభాస్ రెమ్యూనరేషన్ గురించి అడగమని విష్ణు చెప్పాడట. నేను మాట్లాడతా అని చెప్పిన మోహన్ బాబు.. ప్రభాస్ దగ్గరికెళ్లి పారితోషకం గురించి ప్రస్తావిస్తే.. ఇంకోసారి ఈ మాట ఎత్తితే విష్ణును చంపేస్తానని చెప్పండి అని అన్నాడట ప్రభాస్. ఇండియాలోనే బిగ్గెస్ట్ స్టార్ అయిన ప్రభాస్.. స్థాయికి ఈ సినిమాలో నటించడమే గొప్ప అని.. అతను అడిగితే ఎంతైనా ఇవ్వడానికి తాను సిద్ధమని.. కానీ మోహన్ బాబుతో ఉన్న స్నేహం, ఆయన మీదున్న గౌరవంతో ఈ సినిమాలో ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా నటించాడని విష్ణు తెలిపాడు. అందుకే తాను జీవితాంతం ప్రభాస్‌కు రుణపడి ఉంటానన్నాడు.

# శ్రీవిష్ణుకు నారా రోహిత్ ఎప్పుడో చెప్పాడట

'సింగిల్' సినిమా టైటిల్స్‌లో హీరో శ్రీ విష్ణు పేరు ముందు 'కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్' అని వేసింది చిత్ర బృందం. సినిమా చూసిన వాళ్లకు ఇదేమీ అతిగా అనిపించలేదు. పెద్దగా కథ లేకపోయినా.. శ్రీ విష్ణు ఇచ్చిన నాన్ స్టాప్ ఎంటర్టైన్మెంట్ వల్లే ఈ సినిమా హిట్టయింది. యూత్ తన కామెడీని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. 'సామజవరగమన', 'స్వాగ్' సినిమాల్లోనూ తన కామెడీ బాగా పండిరది. 'సింగిల్' కూడా హిట్టయిన నేపథ్యంలో ఇకపై అతను వరుసగా ఎంటర్టైనర్లే చేసేలా కనిపిస్తున్నాడు. నిజానికి శ్రీ విష్ణు కెరీర్ ఆరంభంలో పూర్తిగా సీరియస్ సినిమాలే చేస్తుండేవాడు. అప్పట్లో




ఒకడుండేవాడు, నీదీ నాదీ ఒకే కథ.. లాంటి సినిమాల్లో అతడి క్యారెక్టర్లు చాలా సీరియస్‌గా ఉంటాయి. అతనొక మూడీ హీరో అనే పేరు కూడా ఉండేది. అలాంటి వాడు ఇప్పుడు ఎంటర్టైన్మెంట్‌కు కేరాఫ్ అడ్రస్ అయిపోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. టాలీవుడ్లో ఇదొక ఇంట్రెస్టింగ్ మేకోవర్ అని చెప్పొచ్చు. ఐతే శ్రీ విష్ణు కామెడీ ఇంత బాగా పండిరచగలడని తాను ఎప్పుడో గుర్తించానని అంటున్నాడు అతడికి అత్యంత సన్నిహితుడైన హీరో నారా రోహిత్. శ్రీ విష్ణుకు కెరీర్ ఆరంభంలో రోహిత్ బాగా సపోర్ట్ చేశాడు. తన కెరీర్‌ను మలుపు తిప్పిన 'అప్పట్లో ఒకడుండేవాడు' చిత్రాన్ని ప్రొడ్యూస్ చేసింది కూడా రోహితే. విష్ణుకు వచ్చిన మరి కొన్ని అవకాశాల వెనుక కూడా రోహిత్ ఉన్నాడు. ఐతే ఒకప్పుడు శ్రీ విష్ణు సీరియస్ సినిమాలు చేస్తుంటే.. కామెడీ ఎంటర్టైనర్లు చేయమని గట్టిగా చెప్పినట్లు రోహిత్ వెల్లడిరచాడు.



# ఇంకో రిస్కుకి వరుణ్ తేజ్ సిద్ధం

వరస ఫ్లాపులతో సతమతమవుతున్న వరుణ్ తేజ్ బలమైన కంబ్యాక్ కోసం ఎదురు చూస్తున్నాడు .తనవరకు శక్తి వంచన లేకుండా కష్టపడుతున్నప్పటికీ విజయం మాత్రం అందని ద్రాక్షగా మారిపోయింది. తొలిప్రేమ, ఫిదా స్థాయి బ్లాక్ బస్టర్ దక్కి సంవత్సరాలు గడిచిపోయాయి. కనీసం గద్దలకొండ గణేష్ లాంటి డీసెంట్ సక్సెస్ దక్కినా కొంత ఊరట దక్కేది. కానీ గని, ఆపరేషన్ వాలెంటైన్, గాండీవ ధారి అర్జున, మట్కా ఒకదాన్ని మించి మరొకటి పోవడం ఓపెనింగ్స్ తో పాటు మార్కెట్ ని దెబ్బ తీశాయి. ప్రస్తుతం మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఒక హారర్ కామెడీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే అనంతపూర్ తదితర ప్రాంతాల్లో కీలక షెడ్యూల్ పూర్తి చేసుకుని కొరియా వెళ్లేందుకు రెడీ అవుతోంది. మేర్లపాక గాంధీ ఫామ్ లో లేకపోయినా కథ మీద నమ్మకంతో వరుణ్ తేజ్ దీన్ని చేస్తున్నారు. కొరియన్ కనకరాజు టైటిల్ పరిశీలనలో ఉంది. దీని తర్వాత దర్శకుడు విక్రమ్ సిరికొండకు మెగా ప్రిన్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు లేటెస్ట్ అప్డేట్. ఇతని ట్రాక్ రికార్డు కూడా ఆశాజనకంగా లేదు. 2018లో రవితేజతో టచ్ చేసి చూడు రూపంలో డైరెక్షన్ డెబ్యూ చేసి ఫ్లాప్ రుచి చూశాడు. రచయితగా కొంచెం ఇష్టం కొంచెం కష్టం, మిరపకాయ్, రేస్ గుర్రం లాంటి సూపర్ హిట్స్ కి పని చేసిన అనుభవం ఉంది. ఏడేళ్లు దర్శకత్వానికి దూరంగా ఉన్న విక్రమ్ సిరికొండ ఈసారి విభిన్నమైన బ్యాక్ డ్రాప్ లో ప్రేమకథను ఎంచుకున్నట్టు సమాచారం. మైత్రి మూవీ మేకర్స్ దీన్ని తెరకెక్కించనుంది. ఇతర వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. జయాపజయాల సంగతి పక్కన పెడితే వరుణ్ తేజ దగ్గరికి పెద్ద బ్యానర్లే వస్తున్నాయి. యూవీ, మైత్రి ఇలా ప్రొడక్షన్ లో రాజీ లేని సంస్థలతో చేతులు కలుపుతున్నాడు. విక్రమ్ చెప్పబోయే కథ న్యూ ఏజ్ లవ్ స్టోరీ అంటున్నారు. అది ఎలా ఉండబోతోందో చూడాలి. మరో ఫ్లాప్ డైరెక్టర్ కు ఛాన్స్ ఇచ్చి రిస్క్ చేస్తున్న వరుణ్ తేజ్ ఈ రెండిరటితో విజయం అందుకుంటే తిరిగి రేస్ లోకి వచ్చేయొచ్చు.

# ఆల్కహాల్ అల్లరోడు... కానీ మందు తాగడు



నాందితో సీరియస్ టర్నింగ్ తీసుకుని విజయం అందుకున్న అల్లరి నరేష్ కి ఆ తర్వాత అదే తరహాలో చేసిన ప్రయత్నాలేవీ ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. ఉగ్రం, ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం తీవ్రంగా నిరాశపరిస్తే నా సామిరంగా సక్సెస్ నాగార్జున ఖాతాలోకి వెళ్ళిపోయింది,. తిరిగి కామెడీ ట్రాక్ లో చేసిన ఆ ఒక్కటి అడక్కుతోనూ పనవ్వలేదు. రంగస్థలం రేంజ్ లో ఉంటుందని ఊరించిన బచ్చల మల్లిలో డ్రామా ఎక్కువైపోయి జనం తిరస్కరించారు. దీంతో తనెక్కడ ట్రాక్ తప్పుతున్నాడో గుర్తించిన అల్లరోడు క్రేజీ అండ్ ట్రెండీ కంటెంట్ వైపు దృష్టి సారిస్తున్నాడు. వాటిలో ఒక దాని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై గత ఏడాది అల్లరి నరేష్ హీరోగా ఒక సినిమా ప్రారంభమయ్యింది. మెహర్ తేజ్ దర్శకుడు. దీనికి ఆల్కహాల్ అనే టైటిల్ ఫిక్స్ చేసినట్టు లేటెస్ట్ అప్డేట్. ట్విస్ట్ ఏంటంటే ఇందులో హీరోకు మందు తాగే అలవాటు ఉండదట. అలాంటప్పుడు ఆ పేరు ఎందుకు పెట్టారంటే అదే సస్పెన్స్ ఎలిమెంట్ అంటోంది టీమ్. మెహర్ తేజ్ గతంలో ఫ్యామిలీ డ్రామా తీశాడు. సుహాస్ నెగటివ్ షేడ్ లో నటించిన ఈ క్రైమ్ థ్రిలర్ ఓటిటిలో మంచి స్పందన తెచ్చుకుంది. అది చూసే అల్లరోడు ఆల్కహాల్ కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ఇన్ సైడ్ టాక్. పేరైతే క్రేజీగానే ఉంది మరి. షూటింగ్ సగానికి పైగానే అయిపోయిందని సమాచారం. రుహాని శర్మ హీరోయిన్ గా నటిస్తుండగా జిబ్రాన్ సంగీతం సమకూరుస్తున్నాడు. అల్లరోడి మార్కు హాస్యంతో పాటు కొన్ని థ్రిల్ ఎలిమెంట్స్ ఆల్కహాల్ లో ఉంటాయట. ఇప్పటిదాకా టచ్ చేయని జానర్ లో అల్లరి నరేష్ ని చూడొచ్చని వినికిడి. ఏదైతేనేం తనను తిరిగి ఫామ్ లోకి రావడం చూడాలని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. సోలో హీరోగా తను సాలిడ్ హిట్టు కొట్టి దశాబ్దం దాటిపోయింది. అయినా కూడా అవకాశాలు వస్తున్నాయి. ప్రేక్షకులు ఓపెనింగ్స్ ఇస్తున్నారు. కానీ సరైన కంటెంట్ పడితే మళ్ళీ ట్రాక్ లోకి వస్తాడు. ఆల్కహాల్ ఏమైనా తీరుస్తుందేమో చూడాలి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్లోకి ఎంట్రీ




ఐపీఎల్ 2025లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఇవాళ (మే 29) జరిగిన క్వాలిఫయర్ 1 మ్యాచ్‌లో ఆర్సీబీ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో ఆర్సీబీ తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్లోకి ఎంట్రీ ఇచ్చింది. పంజాబ్ జూన్ 1న జరిగే క్వాలిఫయర్ 2లో రేపు (మే 30) జరుగబోయే ఎలిమినేటర్ మ్యాచ్‌లో (గుజరాత్ వర్సెస్ ముంబై) విజేతతో తలపడుతుంది.

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ ఆర్సీబీ బౌలర్లు ఆకాశమే హద్దుగా చెలరేగడంతో 14.1 ఓవర్లలో 101 పరుగులకే కుప్పకూలింది. హాజిల్‌వుడ్, సుయాశ్ శర్మ తలో 3, యశ్ దయాల్ 2, రొమారియో షెపర్డ్, భువనేశ్వర్ కుమార్ తలో వికెట్ తీశారు.

పంజాబ్ ఇన్నింగ్స్‌లో ప్రభ్‌సిమ్రన్ సింగ్ (18), మార్కస్ స్టోయినిస్ (26), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (18) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. ప్రియాంశ్ ఆర్య 7, జోస్ ఇంగ్లిస్ 4, శ్రేయస్ అయ్యర్ 2, నేహల్ వధేరా 8, శశాంక్ సింగ్ 3, ముషీర్ ఖాన్ 0, హర్‌ప్రీత్ బ్రార్ 4 పరుగులకే ఔటయ్యారు.

అనంతరం 102 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆర్సీబీ.. 10 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి దర్జాగా విజయతీరాలకు చేరింది. ఫిల్ సాల్ట్ (27 బంతుల్లో 56 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు అర్ధ శతకంతో చెలరేగగా.. విరాట్ కోహ్లి 12, మయాంక్ అగర్వాల్ 19, రజత్ పాటిదార్ 15 (నాటౌట్) పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లలో జేమీసన్, ముషీర్ ఖాన్ తలో వికెట్ తీశారు.

**అతి పెద్ద విజయం**

ఐపీఎల్ ప్లే ఆఫ్స్ చరిత్రలో బంతుల పరంగా ఆర్సీబీ అతి పెద్ద విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ మరో 60 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. గతంలో ఈ రికార్డు కేకేఆర్ పేరిట ఉండేది. 2024 సీజన్ ఫైనల్లో కేకేఆర్ ఎస్ఆర్‌హెచ్‌పై 57 బంతులు మిగిలుండగానే విజయతీరాలకు చేరింది.

**నాలుగోసారి..**

తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఆర్సీబీకి ఇది నాలుగో ఫైనల్ అవుతుంది. ఆర్సీబీ 2009, 2011, 2016 సీజన్లలో కూడా ఫైనల్‌కు చేరింది. అయితే మూడు సందర్భాల్లో ఈ జట్టుకు ఓటమే ఎదురైంది.










# మూడోరౌండ్‌కు పోలిని, జంగ్

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ మూడోరౌండ్‌లోకి ఇటలీకి చెందిన 4వ సీడ్ జాస్మినే పోలిని, చైనాకు చెందిన 8వ సీడ్ జంగ్ క్విన్‌వెన్ దూసుకెళ్లారు. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో 2024 ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ పోలిని 63, 63తో ఆస్ట్రేలియాకు చెందిన అజ్లా టోమ్లోనోవిక్‌ను చిత్తుచేసింది. మూడోరౌంఐడ్‌లో పోలిని ఉక్రెయిన్‌కు చెందిన యూలియా లేదా రష్యాకు చెందిన పొటోపోవా మ్యాచ్ విజేతతో తలపడనుంది. పారిస్ ఒలింపిక్ ఛాంపియన్, చైనాకు చెందిన జంక్ క్విన్‌వెన్ 62, 63తో అన్‌సీడెడ్, కొలంబియాకు చెందిన అరాంగోపై వరుససెట్లలో విజయం సాధించింది. ఇతర పోటీల్లో టాప్‌సీడ్ ఇగా స్వైటెక్, 22వ సీడ్, డెన్మార్క్‌కు చెందిన టూసన్, 13వ సీడ్, ఉక్రెయిన్‌కు చెందిన స్విటోలినా 76(74), 75తో బోండార్(హంగేరీ)పై విజయం సాధించి మూడోరౌండ్‌కు చేరారు. మరో పోటీలో 18వ సీడ్ వేకిక్(క్రొయేషియా), 14వ సీడ్ ముఛోవా(చెక్ రిపబ్లిక్) అన్‌సీడెడ్ క్రీడాకారిణుల చేతిలో ఓటమిపాలయ్యారు. వేకిక్ 26, 64, 67(310)తో పెరా(అమెరికా), ముఛోవా 36, 62, 16తో పెర్క్స్(అమెరికా) చేతుల్లో పరాజయాన్ని చవిచూశారు. ఇక పురుషుల సింగిల్‌స్‌లో 2వ సీడ్, కార్లోస్ అల్కరాజ్, 9వ సీడ్, ఇటలీకి చెందిన మసెట్టి ప్రత్యర్థులను చిత్తుచేసి మూడోరౌండ్‌కు చేరారు. స్పెయిన్ యువ సంచలనం, 2024 టైటిల్ విజేత అల్కరాజ్ 61, 46, 61, 62తో ఫరోజోసన్(హంగేరీ)పై, మసెట్టి 64, 60. 64తో గాలన్(కొలంబియా)పై విజయం సాధించి మూడోరౌండ్‌కు చేరారు. మరో పోటీలో 7వ సీడ్ రూఢ్(నార్వే) అనూహ్యంగా రెండోరౌండ్‌లో అన్‌సీడెడ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. హోరాహోరీ పోరులో రూఢ్ 62తో తొలిసెట్ గెలిచినా.. ఆ తర్వాత 46, 16, 06తో మిగిలిన మూడు సెట్లను చేజార్చుకొన్నాడు. రూఢ్‌పై పోర్చుగల్‌కు చెందిన బోర్జెస్ సంచలన విజయం నమోదు చేసుకొని మూడోరౌండ్‌కు చేరాడు.




# 400మీ. మిక్స్‌డ్ రిలేలో భారత్‌కు టైటిల్



ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో మన అథ్లెట్లు పతకాలు కొల్లగొడుతున్నారు. బుధవారం జరిగిన 4ఐ400మీ. మిక్స్‌డ్ రిలేలో భారత్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఫైనల్లో భారత అథ్లెట్ల బృందం 3నిమిషాల 18:12సెకన్లలో గమ్యానికిచేరారు. రూపల్ చౌదరి, సంతోష్ కుమార్, తమిళరాసన్, విశాల్, శుభా వెంకటేశన్‌లతో కూడిన భారత బృందం బంగారు పతకాన్నికైవసం చేసుకుంది. 2023లో తొలిసారి స్వర్ణ పతకం చేజిక్కించుకున్న భారత బృందం.. 2019లో రజత పతకానికే పరిమితమైంది. చైనా (3:20.52సెకన్లు), శ్రీలంక (3:21.95సెకన్లు) రజత, కాంస్య పతకాలను చేజిక్కించుకున్నాయి. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ రజత పతకాన్ని సాధించాడు. ఫైనల్‌కు చేరిన ఎనిమిది మంది అథ్లెట్ల మధ్య జరిగిన పతక పోరులో తేజస్విన్ 7,618పాయింట్లతో రెండోస్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఫీ షియాంగ్(చైనా) 7,534పాయింట్లు స్వర్ణ పతకం సాధించగా..జపాన్‌కు చెందిన కిసుకే ఒకోడా 7,602పాయింట్లు కాంస్య పతకం సాధించారు. మహిళల 400మీ. పరుగులో రూపల్ చౌదరి, 1500మీ. పరుగులో పూజ, పురుషల ట్రిపుల్ జంప్‌లో ప్రవీన్ చిత్రవేల్ రజత పతకాలను సాధించారు. ఏకైక కాంస్య పతకాన్ని పురుషుల 1500మీ. పరుగులో యువాన్ షా సాధించాడు. రెండోరోజు భారత్‌కు ఆరు పతకాలు దక్కాయి. ఇందులో ఒక స్వర్ణ, నాలుగు రజత పతకంతోపాటు మరో కాంస్య పతకం దక్కింది. రెండోరోజు పోటీలు ముగిసేసరికి భారత్ పతకాల పట్టికలో 2వ స్థానానికి ఎగబాకింది.

# శిఖర్ ధావన్ ఎమోషనల్ మెసేజ్..

శిఖర్ ధావన్, అయేషా ముఖర్జీల మధ్య 2023లో విడాకులు మంజూరయ్యాయి. విడాకుల సమయంలో ఢల్లీ కోర్టు అయేషా చేసిన "మానసిక క్రూరత్వం" కారణంగా ధావన్‌కు విడాకులు ఇచ్చింది. అయితే, జొరావర్ కస్టడీ అయేషా వద్దనే ఉంది. ధావన్‌కు పరిమితమైన సందర్శన హక్కులు, వీడియో కాల్స్ ద్వారా సంభాషించే అవకాశం మాత్రమే లభించింది. భారత క్రికెటర్ శిఖర్ ధావన్ తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొంటున్న సవాళ్లను గురించి తరచుగా బహిరంగంగానే మాట్లాడుతుంటాడు. తన కుమారుడు జొరావర్‌తో దూరంగా ఉండటం వల్ల కలిగే మానసిక వేదనను ఆయన పలు సందర్భాల్లో పంచుకున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఒక పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, జొరావర్‌కు తండ్రిగా ఒక ముఖ్యమైన సందేశాన్ని అందించాడు. ఈ సందేశం ఎంతో భావోద్వేగభరితంగా సాగింది. రానున్న 20 సంవత్సరాల తర్వాత జొరావర్ 3132



ఏళ్ల వయసులో ఉంటాడని శిఖర్ ధావన్ ఆ పోడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. అప్పుడు తన కుమారుడికి తాను చెప్పదలుచుకున్న విషయం ఒక్కటే అని, అది "నువ్వు ఏది చేసినా సంతోషంగా ఉండు. సంతోషంగా ఉండటానికి మార్గం నీలోపల వెతుక్కోవడమే. నీ లోపల ఉన్న లోపాలను గుర్తించు, నీ బలాన్ని తెలుసుకో, వాటిని మెరుగు పరచుకో. అంతే, నువ్వు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను" అంటూ శిఖర్ ధావన్ తెలిపాడు. తన కుమారుడు జొరావర్ తనతో ఇప్పుడు మాట్లాడటం లేదని, అయితే తాను ఆధ్యాత్మికంగా అతనితో కనెక్ట్ అయి ఉన్నానని శిఖర్ ధావన్ గతంలో కూడా వెల్లడిరచాడు. తాను జొరావర్‌ను కౌగిలించుకుంటున్నట్లు, ప్రేమను పంచుకుంటున్నట్లు భావిస్తున్నానని ఆయన చెప్పుకొచ్చాడు. జొరావర్ తనతో ఉండాలనుకుంటే, తాను ఎప్పుడూ అతని కోసం ఉంటానని ధావన్ భావోద్వేగంగా తెలిపాడు. ఇది తండ్రిగా తన బాధ్యత అని ఆయన అన్నాడు. శిఖర్ ధావన్, అయేషా ముఖర్జీల మధ్య 2023లో విడాకులు మంజూరయ్యాయి. విడాకుల సమయంలో ఢల్లీ కోర్టు అయేషా చేసిన "మానసిక క్రూరత్వం" కారణంగా ధావన్‌కు విడాకులు ఇచ్చింది. అయితే, జొరావర్ కస్టడీ అయేషా వద్దనే ఉంది. ధావన్‌కు పరిమితమైన సందర్శన హక్కులు, వీడియో కాల్స్ ద్వారా సంభాషించే అవకాశం మాత్రమే లభించింది. ఈ పరిమితుల కారణంగా, ధావన్ తన కుమారుడిని కలవడానికి, అతనితో మాట్లాడటానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిలో శిఖర్ ధావన్ పడుతున్న బాధను అతని మాటలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. తన కుమారుడికి తండ్రి ప్రేమను పంచుకోవడానికి ఆయన తపిస్తున్న తీరు అందరినీ కదిలిస్తోంది. క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రదర్శనతో అభిమానుల హృదయాలను గెలుచుకున్న ధావన్.. వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొంటున్న ఈ సవాలును కూడా మానసిక ధైర్యంతో ఎదుర్కొంటున్నాడు. జొరావర్ ఎప్పటికీ తన గుండెల్లోనే ఉంటాడని, తన ప్రేమ ఎప్పుడూ తన కుమారుడికి ఉంటుందని శిఖర్ ధావన్ సందేశం ఎంతో మందికి స్ఫూర్తినిస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in